

బిసి సంఘాల ప్రతినిధులతో
సమావేశమైన అదనపు కలెక్టర్ మోహన్‌రావు

## 8న బిసి కమిషన్ బృందం రాక

**మహబూబ్‌నగర్‌లో ప్రజాభిప్రాయ సేకరణ.. అదనపు కలెక్టర్ మోహన్‌రావు వెల్లడి**

**మహబూబ్‌నగర్ బ్యూరో,అక్టోబరు 29 ప్రభాతవార్త :** తెలంగాణ రాష్ట్రంలో స్థానిక సంస్థల వారిగా కల్పించాల్సిన రిజర్వేషన్ల దామాషాపై ఆయా రాజకీయ పార్టీలు, సంఘాలు, ప్రజల నుండి అభ్యర్థనలు స్వీకరించేందుకు వీలుగా తెలంగాణ బిసి కమిషన్ ఛైర్మన్ జి.నిరంజన్ నేతృత్వంలోని సభ్యుల బృందం నవంబర్ 8న మహబూబ్‌నగర్‌లోని సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలో మహబూబ్‌నగర్ ఉమ్మడి జిల్లాకు సంబంధించి ప్రజాభిప్రాయ సేకరణ నిర్వహించనున్నట్లు రెవెన్యూ అదనపు కలెక్టర్ మోహన్‌రావు తెలిపారు. మంగళవారం సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలో బిసి సంఘాల ప్రతినిధులతో బిసి కమిషన్ పర్యటన కమిషన్ విధి విధానాలపై వివరించారు. నవంబర్ 8 కమిషన్ నిర్వహించనున్న ప్రజాభిప్రాయ సేకరణలో భాగంగా హెల్ప్‌డెస్క్, రిజిస్ట్రేషన్ టీమ్ ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. హెల్ప్ డెస్క్ కమిషన్ విచారణ, రిజిస్ట్రేషన్ ఫారంలు అందజేయడం జరుగుతుందని తెలిపారు. ఆయా పార్టీలు, వివిధ సంఘాల నాయకులు, ప్రజలు తమ విజ్ఞాపనలను, వినతులను ఆరు సెట్లలో నోటరీ చేసిన అఫిడవిట్ సమర్పించాలని తెలిపారు. రిజిస్ట్రేషన్ చేసుకున్న వారికి టోకెన్ జారీచేయడం జరుగుతుందని అన్నారు. ఈ సమావేశంలో బిసి సంక్షేమ శాఖ అధికారిణి ఇందిర తదితరులు పాల్గొన్నారు.


# మహబూబ్‌నగర్ వార్త



నాగర్‌కర్నూల్ / వనపర్తి / జోగులాంబ గద్వాల / నారాయణపేట


వైద్య సేవల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే

## కఠిన చర్యలు తప్పవు..

**జిల్లా కలెక్టర్ బి.ఎం.సంతోష్ హెచ్చరిక**



వైద్య అధికారుల సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ సంతోష్

**గద్వాల, అక్టోబరు 29 ప్రభాతవార్త:** మంగళవారం కలెక్టర్ కార్యాలయంలోని కాన్ఫరెన్సు హాలులో వైద్యాధికారులతో మాతృమరణాలపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లాలోని ధరూర్ మండలం ఉప్పేర ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో సంభవించిన మాతృమరణాల పట్ల సంబంధిత వైద్యాధికారులతో సమీక్షించారు. ఉప్పేర ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో సంభవించిన మాతృమరణాల పట్ల తీవ్ర ఆగ్రహం వ్యక్తపరిచారు. ఇలాంటి ఘటనలు తిరిగి జరగకుండా జాగ్రత్తలు వహించాలని హెచ్చరించారు. ఉప్పేర వైద్యాధికారికి షోకాస్ నోటీస్ జారీ చేయాలని జిల్లా వైద్యాధికారికి ఆదేశాలు జారి చేశారు. మరణాలకు ముఖ్య కారణం రక్తహీనత, రవాణా సదుపాయం లేకపోవడం వల్ల సంభవించినట్లు డాక్టర్లు కలెక్టర్ కు తెలియజేశారు. హైరిస్క్ కేసులను, నిర్లక్ష్యం వహించకుండా వెంటనే ఉన్నత ఆసుపత్రికి రెఫర్ చేయాలని కలెక్టర్ సూచించారు. జిల్లాలో ఎంబిబిఎస్ డాక్టర్ల కొరత కారణంగా సమస్యలు తలెత్తుతున్నాయని, ఇందుకు అవసరమైన వైద్య అధికారుల నియామకాలు వెంటనే చేపట్టాలని జిల్లా వైద్యాధికారికి ఆదేశాలు ఇచ్చారు. అత్యవసర సమయాలలో అంబులెన్సులు అందుబాటులో ఉండే విధంగా చూడాలని, ఏఎన్ఎంలు, అంగన్‌వాడీలు గర్భిణీ స్త్రీల పట్ల ప్రత్యేక శ్రద్ధ వహించి వారికి సమయానుకూలంగా వైద్య సలహాలతో పాటు మంచి పౌష్టికాహారం అందించాలని సూచించారు. ఈ సమావేశంలో జిల్లా వైద్యాధికారి సిద్దప్ప, ప్రోగ్రాం ఆఫీసర్లు ప్రసన్న రాణి, గైనకాలజిస్టు దమయంతి, ప్రైవేట్ ఆసుపత్రిలో ఘనకాలజిస్టులు, వైద్యాధికారులు తదితరులు ఉన్నారు.

ముమ్మరంగా

## జాతర ఏర్పాట్లు..

**జాతర మైదానంలో వెలుస్తున్న దుకాణాలు**



జాతర మైదానంలో వెలుస్తున్న దుకాణ సముదాయాలు

**చిన్నచింతకుంట,అక్టోబరు 29 ప్రభాతవార్త:** నవంబర్ 2నుంచి ప్రారంభం కానున్న పల్లె జాతరకు తరలివచ్చే భక్త జనానికి ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఉండేందుకు దేవస్థాన సిబ్బందితోపాటు వివిధ శాఖల అధికారులు జాతర ఏర్పాట్లు పనులను ముమ్మరంగా చేపడుతున్నారు. జాతరలో మురుగునీరు నిలబడకుండా ఉండేందుకు కాల్వలలో చెత్తను తొలగిస్తున్నారు. ఉద్దాల గుండు వద్ద పిచ్చి మొక్కలు తొలగిస్తూ, నేలను చదును చేస్తున్నారు. మరుగుదొడ్ల నిర్మాణ పనులు త్వరితగతిన పూర్తి చేసేందుకు కూలీలతో పనులు చేపడుతున్నారు. భక్తులకు మంచినీటి వ్యవస్థ పనులను పూర్తి చేస్తున్నారు. జాతరకు వెళ్లే వివిధ గ్రామాల రహదారులకు ఇరువైపులా ముళ్లపొదలను, పిచ్చి మొక్కలను తొలగింపు పనులు ముమ్మరంగా కొనసాగుతున్నాయి. జాతర ఏర్పాట్ల పనులలో దేవస్థానసిబ్బంది, అధికారులు బిజీగా చేపడుతున్నారు.

**జాతర మైదానంలో వెలుస్తున్న దుకాణాలు...**

శ్రీ కురుమూర్తి స్వామి జాతరకు వివిధ ప్రాంతాల నుంచి వ్యాపారస్తులు జాతర మైదానంలో తమ దుకాణాలను ఏర్పాటు చేసుకుంటున్నారు. భోజన హోటళ్లు, మిఠాయి దుకాణాలు, ఫ్యాన్సీ దుకాణాలు, చిన్నారులకు ఆటవిడుపుగా ఉండే రంగుల రాట్నాలు ఏర్పాటు చేస్తున్నారు. జాతర పనులను ఎప్పటికప్పుడు దేవస్థాన ఛైర్మన్ గోవర్ధన్‌రెడ్డితో పాటు పాలక మండలి సభ్యులు పర్యవేక్షిస్తున్నారు.

# రైతు నిరసన సభ..

**కొత్త పథకాలు రాలేదు కానీ ఉన్న పథకాలు**

**ఒకటొకటి బందు పెడుతున్నాడు..**

**అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి అక్కడి**

**నుండి రైతు నిరసన కార్యక్రమానికి ర్యాలీ బయలుదేరిన**

**సిద్దిపేట ఎమ్మెల్యే హరీష్ రావు**



రైతు నిరసన సభలో మాట్లాడుతున్న తన్నీరు హరీష్ రావు

**వనపర్తి, అక్టోబరు 28 ప్రభాతవార్త :** వనపర్తిలో రైతు నిరసన కార్యక్రమంలో హాజరైన ఎమ్మెల్యే తన్నీరు హరీష్ రావు, అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి అక్కడి నుండి రైతు నిరసన కార్యక్రమానికి బయలుదేరారు. రైతు నిరసన కార్యక్రమంలో పాల్గొన్న సిద్దిపేట ఎమ్మెల్యే తన్నీరు హరీష్ రావు మాట్లాడుతూ రేవంత్ రెడ్డి ప్రభుత్వం మీద రైతులు ఎంత అగ్రహంగా ఉన్నారు అనడానికి ఇది ఒక సంకేతం అని అన్నారు. మధ్యాహ్నం రెండు ఐతుంది ఒక్క మనిషి కూడా పక్కకు పోకుండా ఆకలైతున్న కూడా కసిగా ఈ సమావేశంలో మీరందరూ కూర్చున్నారు అంటేనే ఈ ప్రభుత్వం మీద ఎంత వ్యతిరేకత ఉన్నదో మనకు అర్థమవుతుంది. కొత్త పథకాలు రాలేదు కానీ ఉన్న పథకాలు ఒకటొకటి బందు పెడుతున్నాడు. బతుకమ్మ పండుగ ఆడపిల్లలకు బతుకమ్మ చీరలు,కెసిఆర్ ఎండగా ఆడపిల్ల పుడితే 13000 మగ పిల్ల పుడితే 12,000 కాన్పు చేయించి కెసిఆర్ కిట్ ఇచ్చి ఆటో కిరాయి లేకుండా తల్లిని పిల్లని ఇంటికాడ దించిన ఘనత కేసిఆర్ ప్రభుత్వంది ఇవాళ రైతు నిరసన సభలో రైతులు బాధపడుతున్నారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలో రాకముందు వరంగల్ డిక్లరేషన్ సభ పెట్టిండు మీ అందరి చేతుల్లో కాగితాలు కనబడ్డాయి వరంగల్ డిక్లరేషన్ లో అనేక హామీలు ఇచ్చారు. రైతుల కోసం ఎన్నో మాటలు చెప్పారు అంటే అయితే దేవుని మీద ఒట్లు అడిగితే తిట్లు..ఉద్యమాల గడ్డ పోరాటాల గడ్డ ఆనాడు నిజాం మీద పోరాడినటువంటి గడ్డం సమైక్యవాదుల మీద వైయస్ రాజశేఖర్ రెడ్డి చంద్రబాబు నాయుడు మీద పోరాడి తెలంగాణ సాధించిన గడ్డ రేవంత్ రెడ్డి డిసెంబర్ 9, 2023 రుణమాఫీ కాలేదు ఇంకేప్పుడు చేస్తాడు అని బిఆర్ఎస్ పార్టీ అడుగడుగున ప్రశ్నించింది. రైతులు ఓట్లు కోసం పార్లమెంటు ఎలక్షన్లో ముంగట మల్ల కొత్త డ్రామా మొదలు పెట్టిండు ఎలక్షన్ మేనిఫెస్టో చెప్పిన ఒక్క మాట కూడా నెరవెర్చకుండా పబ్బం గడుపుతున్నారు. రేవంత్ రెడ్డి ఢిల్లీకి మూటలు పంపుకుంటూ లక్షా 50 వేల కోట్లతో మూసి సుందరీ చేస్తామని అంటున్నాడు. పేద రైతులకు ఏం చేయాలో మీరే చెప్పాలి రైతుబంధు ఇవ్వకుండా ఉంటే ఊరుకుందామా ఆలోచించండి రైతుబంధు సంగతి అన్నారు. వడ్లకు బోనస్,జొన్నలకు బోనస్ ఇస్తామన్నారు. డిసెంబర్ 9, 2023 ఇస్తాం అన్నారు. దసరా పండుగ వరకు రుణమాఫీ అయిపోతుందన్నారు. డిసెంబర్ 9, 2024 నాటికి ఓ రెండు మూడు లక్షల మందికి చేస్తాం అన్నారు. వనపర్తి రావుల చంద్రశేఖర్ రెడ్డి ఎమ్మెల్యే ఉన్నప్పుడు గానీ ఉన్నప్పుడు గానీ ఈ ప్రాంతంలో వలసలు ఉండేది బుద్ధారం బ్రాంచ్ కెనాల్ తవ్వించిండు కేసీఆర్ వనపర్తి అభివృద్ధిలో కృషి కేసిఆర్ ఆశీస్సులు అని చెప్పి నేను గుర్తు చేస్తా ఉన్నాం.మెడికల్ కాలేజీ తెచ్చిందు నర్సింగ్ కాలేజీ తెచ్చిందు బి ఎస్సీ అగ్రికల్చర్ కాలేజీ, సరస్వతి నిలయం వనపర్తిని అద్భుతంగా మన కేసీఆర్ ఇచ్చిన నోటీఫికేషన్లు పెట్టిన పరీక్షలు ఇచ్చిన ఫలితాలకు వచ్చింది.ఏస్సీ ,ఎస్టీ, బీసీ లకు జీఓ నిరుద్యోగులకు దళిత విద్యార్థులకు బీసీ విద్యార్థులకు మా గిరిజన విద్యార్థుల నోట్లో మట్టి కొట్టిండు రేవంత్ రెడ్డి జీఓ 29 వల్ల మెరిట్లో ఓపెన్ కేటగిరిలో ఎస్సీ,బీసీ,ఎస్టీలకు అవకాశం లేకుండా చేస్తున్నాడు. ఈ రోజైనా పిల్లలకు ఫీజు రియంబర్స్మెంట్ రేవంత్ రెడ్డి,రైతులు కూడా చాలా ఇబ్బందుల్లో ఉన్నారు. మహాలక్ష్మి పథకం కింద ఆడబిడ్డలకు రేవంత్ రెడ్డి 25 వేల రూపాయలు బాకీ ఉన్నాడు రావుల చంద్రశేఖర్ రెడ్డి ఆధ్వర్యంలో తెలంగాణ భవన్లో కి లీగల్ సెల్లు ఉంది ఒక్క రూపాయి ఖర్చు లేకుండా నాలుగు వందల 86 మందికి స్టేట్ ఇచ్చిన వాళ్ల ఆస్తులు కూలగొట్టకుండా టిఆర్ఎస్ పార్టీ మీకు అండగా ఉంటది ధైర్యంగా ఉండండి కొంతమంది పోలీసులు అతిగా వ్యవహరిస్తున్నారు అన్యాయంగా కేసుల పెడుతున్నారు అని మాట్లాడారు.



అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి
నిరసన కార్యక్రమానికి బయలు దేరిన సిద్దిపేట ఎమ్మెల్యే తన్నీరు హరీష్ రావు

**మాజీ ఎమ్మెల్యే గువ్వల బాల్‌రాజ్ అసంతృప్తి**

రైతు నిరసన కార్యక్రమంలో ఎమ్మెల్యే గువ్వల బాలరాజు మాట్లాడుతూ అగ్రవర్ణాల చెందిన కొందరు రాజకీయ నాయకులు నన్ను రాజకీయంగా ఎదగకుండా ఆటంకాలు సృష్టిస్తూ అణగదొక్కుతున్నారు. నేను ఎక్కడికి వెళ్లినా నువ్వు నాన్ లోకల్ అని హేళన చేస్తున్నారు. పార్టీలో కొందరు ఎదగకుండా రాజకీయ జీవితాన్ని లేకుండా చూడాలి గట్టి ప్రయత్నాలు చేసినప్పటికి కూడా నన్ను ప్రజలను ఆదరించారు. ఇక ముందు జరగబోయే కార్యక్రమంలో నిజమైన కార్యకర్తలకు ఎదుగుదలకు కృషి చేయాలి,నేను వనపర్తి గడ్డ బిడ్డను నా రాజకీయ జీవితం మొదలుపెట్టాను ఎక్కడ తగ్గేది లేదు అని అసంతృప్తి తెలియజేశారు. ఈ కార్యక్రమంలో మాజీ మంత్రి నిరంజన్ రెడ్డి, శ్రీనివాస్ గౌడ్, రావుల చంద్రశేఖర్ రెడ్డి, హర్షవర్ధన్ రెడ్డి, అంజయ్య యాదవ్, గువ్వల బాల్‌రాజ్, ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ ,రజని,జిల్లా అధ్యక్షుడు గట్టు యాదవ్, రైతులు పార్టీ కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.



రైతు నిరసన సభలో హాజరైన రైతులు, పార్టీ కార్యకర్తలు

# ఎడ్యుకేషనల్ హబ్‌గా మహబూబ్‌నగర్..

**ముఖ్యమంత్రి చేతుల మీదుగా త్వరలో**

**ఇంజనీరింగ్, లా కళాశాలలకు శంకుస్థాపన**

**ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి వెల్లడి**

**మహబూబ్‌నగర్ బ్యూరో,అక్టోబరు 29 ప్రభాతవార్త :** ఎడ్యుకేషనల్ హబ్‌గా మహబూబ్‌నగర్‌ను అభివృద్ధి చేయడమే తన లక్ష్యమని మహబూబ్‌నగర్ ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి మరోసారి స్పష్టం చేశారు. మంగళవారం మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలోని ఎంఈఓ కార్యాలయంలో జరిగిన ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలు, కళాశాలల యాజమాన్యాలతో జరిగిన సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. సీఎం నియోజకవర్గంలో ఐటిఐ కళాశాలను అప్‌గ్రేడ్ చేసి ఇంజనీరింగ్ కళాశాల ఏర్పాటు చేసుకున్నామని, అలాగే ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రత్యేక చొరవ తీసుకుని ఇప్పుడు మన మహబూబ్‌నగర్ పాలమూరు విశ్వవిద్యాలయంలో ఇంజనీరింగ్, లా కళాశాల ఏర్పాటు కోసం అనుమతి ఇచ్చారని అందుకు ఈ సందర్భంగా ముఖ్యమంత్రికి ఆయన ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. పాలమూరు విశ్వ విద్యాలయానికి యూజిసి ఫండ్ నుంచిరూ. 100 కోట్లను తెచ్చుటలో మేము పూర్తి స్థాయిలో ఎఫర్ట్స్ పెట్టి రూ.100 కోట్ల ఫండ్ తీసుకురావడం జరిగిందని తెలిపారు. వచ్చే అకాడమిక్ ఇయర్‌లోనే ఇంజనీరింగ్, లా నూతన విద్యా సంవత్సరం ప్రారంభం కాబోతుందని, మన మహబూబ్‌నగర్ జిల్లా విద్యార్థులకు ఇంజనీరింగ్, లా కళాశాల వల్ల చాలా ప్రయోజనాలు కలుగుతాయని తెలిపారు. రేపు పాలమూరు విశ్వవి ద్యాలయంలో జరిగే కృతజ్ఞత సభను విజయవంతం చేయాలని ఆయన కోరారు. ముఖ్యమంత్రి ఇంజనీరింగ్, లా కళాశాల భవనాలకు త్వరలో శంకుస్థాపన చేస్తారని ఆయన చెప్పారు. కార్యక్రమంలో మున్సిపల్ ఛైర్మన్ ఆనంద్‌గౌడ్, డిఇఓ రవిందర్, టిపిసిసి ప్రధాన కార్యదర్శి వినోద్‌కుమార్, ఎంవిఎస్ కళాశాల ప్రిన్సిపాల్ పద్మావతి, సిఎంఓ బాలుయాదవ్, ఎఎంఓ శ్రీనివాస్, వివిధ ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలు, కళాశాలల ప్రధానోపాధ్యాయులు, ప్రిన్సిపాల్స్, కౌన్సలర్లు పాల్గొన్నారు.




మాట్లాడుతున్న ఎమ్మెల్యే శ్రీనివాస్‌రెడ్డి

## వచ్చే నెల 6 నుండి సమగ్ర కుటుంబ సర్వే..

**మహబూబ్‌నగర్ కలెక్టర్ విజయేంద్రబోయి వెల్లడి**

**సమగ్ర సర్వేపై మాస్టర్ ట్రైనీలకు శిక్షణ**



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్

**మహబూబ్‌నగర్ బ్యూరో,అక్టోబరు 29 ప్రభాతవార్త :** జిల్లాలో నవంబర్ 6 నుండి 18 వరకు నిర్వహించనున్న సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వే (సామాజిక, ఆర్థిక, రాజకీయ కుల సర్వే)ను పకడ్బందీగా, ఎటువంటి అప్పులకు ఆస్కారం లేకుండా నిర్వహించేలా ఎన్యుమరేటర్‌లు, సూపర్‌వైజర్‌లకు శిక్షణ ఇవ్వాలని జిల్లా కలెక్టర్ విజయేందిర బోయి సూచించారు. మంగళవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వేపై జిల్లాస్థాయి మాస్టర్ ట్రైనర్లను ఉద్దేశించి ఏర్పాటు చేసిన శిక్షణ కార్యక్రమానికి ఆమె ముఖ్య అతిథిగా హాజరయ్యారు. శిక్షణసందర్భంగా మాస్టర్ ట్రైనర్లు అన్ని అంశాలపై ప్రత్యేక శ్రద్ధ వహించి అన్ని విషయాలను క్షుణ్ణంగా తెలుసుకోవాలని, ఏవైనా సందేహాలు ఉన్నట్లయితే శిక్షణలోనే నివృత్తి చేసుకోవాలని, శిక్షణలో నేర్చుకున్న విషయాలను రేపు మండల స్థాయిలో ఎన్యుమరేటర్‌లకు, సూపర్‌వైజర్‌లకు శిక్షణ ద్వారా అవగాహన, కల్పించాలని చెప్పారు. జిల్లాలో సామాజిక, ఆర్థిక విద్య, ఉపాధి, రాజకీయ కుల సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వే పకడ్బందీగా చేపట్టాలన్నారు.

**ఓటరు నమోదులో మార్పులు, చేర్పులకు అవకాశం...**

ఓటుహక్కు ప్రాముఖ్యతపై యువతలో అవగాహన కల్పించి అర్హులైన వారిని ఓటరుగా నమోదు చేసుకునే విధంగా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ విజయేందిర బోయి సూచించారు. మంగళవారం కలెక్టరేట్ కార్యాలయంలోని కలెక్టర్ ఛాంబర్‌లో ఓటరు ముసాయిదా జాబితా పై వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో కలెక్టర్ సమావేశం నిర్వహించి ఓటరు ముసాయిదాను విడుదల చేసినట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జనవరి 1, 2025 నాటికి 18 సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్కరు ఓటరుగా నమోదు చేసుకునేలా రాజకీయ పార్టీల ప్రతినిధులు ప్రత్యేక చొరవ చూపాలన్నారు. అక్టోబర్ 29 నుండి నవంబర్ 28 వరకు నూతనంగా ఓటరు నమోదు, ఏవైనా మార్పులు, చేర్పులతో ఓటరు జాబితాలో అభ్యంతరాలపై ఫిర్యాదులు చేయవచ్చని తెలిపారు. రాజకీయ పార్టీలు పోలింగ్ బూత్ స్థాయిలో ఏజెంట్లను నియమించే దిశగా జాబితాలను సమర్పించాలని కలెక్టర్ తెలిపారు. ఓటరు నమోదు, ఓటరు జాబితాలో మార్పులు, చేర్పులు చేసుకునేందుకు నవంబర్ 9,10 తేదీలలో ఓటరు నమోదుకు బూత్ స్థాయిలో ప్రత్యేక శిబిరాలను ఏర్పాటు చేయడం జరుగుతుందన్నారు. సమావేశంలో అదనపు కలెక్టర్లు శివేంద్రప్రతాప్, మోహన్‌రావులు, డిఆర్ఓ కెవివి రవికుమార్, మండల కో ఆర్డినేటర్‌లు, మాస్టర్ ట్రైనర్లు పాల్గొన్నారు.

# భూత్పూర్ పోలీస్ స్టేషన్‌ను తనిఖీ చేసిన జిల్లా ఎస్పీ జానకి..

**- పీఎస్ ఆవరణలో మొక్కలు నాటిన ఎస్పీ..డీఎస్పీలు..**

**- పోలీసుల నుంచి గౌరవ వందన సమర్పణ స్వీకరించిన ఎస్పీ..**

**భూత్పూర్,అక్టోబరు 29,ప్రభాతవార్త :** మహబూబ్‌నగర్ జిల్లా ఎస్పీ డి జానకి వార్షిక తనిఖీలో భాగంగా మంగళవారం భూత్పూర్ పోలీస్ స్టేషన్‌ను సందర్శించి సర్కిల్,పీఎస్ రికార్డులను తనిఖీ చేశారు. జిల్లా ఎస్పీగా బాధ్యతలు స్వీకరించి తొలిసారిగా భూత్పూర్ పీఎస్ తనిఖీ,సందర్శనకు వచ్చిన జిల్లా ఎస్పీ డి జానకి పోలీసుల నుంచి గౌరవ వందన సమర్పణ స్వీకరించారు.పీఎస్ ఎస్సై చంద్రశేఖర్ ఆధ్వర్యంలో పోలీసులు జిల్లా ఎస్పీ ముందు పరేడ్ నిర్వహించారు.అనంతరం జిల్లా ఎస్పీ జానకి,డీఎస్పీ వెంకటేశ్వర్లు, సీఐ రామకృష్ణ,ఎస్సై చంద్రశేఖర్‌లు పోలీస్ స్టేషన్ ఆవరణలో మొక్కలు నాటారు.



పీఎస్ ఆవరణలో మొక్కలు నాటుతున్న ఎస్పీ

సర్కిల్,పీఎస్‌లలో రికార్డులను పరిశీలించిన అనంతరం జిల్లా ఎస్పీ మీడియా సమావేశంలో మాట్లాడుతూ సర్కిల్ కార్యాలయం,పోలీస్ స్టేషన్ తనిఖీ సంతృప్తికరంగా ఉన్నట్లు తెలిపారు. జిల్లాలో రోడ్ సేఫ్టీ భద్రతా చర్యలు పకడ్బందీగా చేపట్టినట్లు చెప్పారు. జిల్లాలో



జిల్లా ఎస్పీ జానకికి మొక్కను ఇచ్చి స్వాగతం పలుకుతున్న సీఐ రామకృష్ణ

ఆవరించి ఉన్న జాతీయ రహదారి-44 పొడవునా ప్రమాదాలకు ఆస్కారముండే బ్లాక్ స్పాట్లను గుర్తించి ప్రమాదాలను అరికట్టేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. వాహనాలను నడిపేవారు ట్రాఫిక్ నిబంధనలు ఖచ్చితంగా పాటించే విధంగా ఎక్కడికక్కడ ప్రత్యేక తనిఖీ బృందాలను ఏర్పాటు చేసినట్లు చెప్పారు. నిబంధనలు అతిక్రమించినవారిపై తగిన జరిమానా విధించే విధంగా చర్యలు తీసుకున్నా మన్నారు. భూత్పూర్ పీఎస్ సరిపోను పోలీస్ సిబ్బంధి కొరతను విలేకరులు ఎస్పీ దృష్టికి తీసుకురాగా, నవంబర్ నెలలో కొత్త నియామకాలు జరుగుతున్నాయని,అప్పుడు భూత్పూర్ పీఎస్‌కు కొత్తగా ఇద్దరు,ముగ్గురు పీసీలను నియమించే అవకాశముందని తెలిపారు. ఈ కార్యక్ర మంలో డీఎస్పీ వెంకటేశ్వర్లు,సీఐ రామకృష్ణ,భూత్పూర్ పోలీస్ ఎస్సై చంద్రశేఖర్‌తో పాటు భూత్పూర్ సర్కిల్ పరిధిలోని ఐదు పోలీస్ స్టేషన్ల ఎస్సైలు పాల్గొన్నారు.

**సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వే**

## విజయవంతంగా నిర్వహించాలి

**సమగ్ర ఇంటింటి కుటుంబ**

**సర్వేపై వీడియో కాన్ఫరెన్స్ ద్వారా**

**సమీక్షించిన ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క**






వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న ఉప ముఖ్యమంత్రి వీడియో కాన్ఫరెన్స్‌కు హాజరైన కలెక్టర్ అధికారులు

- మిగతా3లో..

## ఆశా కార్యకర్తలకు రికార్డుల పంపిణీ

**బిజినేపల్లి,అక్టోబరు 29 ప్రభాతవార్త :** వైద్యారోగ్య శాఖ కార్యకర్తలకు క్షేత్రస్థాయిలో ప్రతిరోజు నిర్వహిస్తున్న వివిధ ఆరోగ్య సేవల వివరాలు నమోదు చేసుకునేందుకు ఆశ కార్యకర్త దినచర్య రికార్డులను మంగళ వారం లట్టుపల్లి వైద్యాధికారి డా. బి. ఆలోచన ఆశా కార్యక ర్తలకు పంపిణీ చేశారు. డా. బి. ఆలోచన మాట్లాడుతూ ఆశా కార్యకర్తలు క్షేత్రస్థాయిలో నిర్వహిస్తున్న అన్ని రకాల సే వలను ఒకే రికార్డులో నమో దు చేసుకుంటూ రాష్ట్ర ప్రభు త్వం ప్రత్యేకంగా రూపొందించిన రికార్డులను ఒక్కొక్కరికి ఒకే రకపు ఐదు రికార్డులను పంపిణీ చేసినట్లు ఆమె తెలిపారు. అదేవిధంగా రికార్డు ఏ విధంగా పూర్తి చేయాలి విధివిధానాలను వారి కి తెలిపారు. కార్యక్రమంలో ఆశా నోడల్ పర్సన్ ఎస్.బాలమణి, పర్యవేక్షకులు శశికళ, వైద్యులు డా.తేజస్విని, డా.మేఘనారెడ్డి, ఆరోగ్య కార్యకర్తలు యాదగిరి, సలీం,నగేష్, మహిళా ఆరోగ్య కార్యకర్తలు, బొజ్జమ్మ, హెలెన్, జకియా, జ్యోతి మంగనూరు,గంగారం లట్టుపల్లి, ఎర్రకుంట తండా ఆరోగ్య ఉపకేంద్రాల ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.


ఆశా కార్యకర్తలకు రికార్డులు పంపిణీ చేస్తున్న వైద్యాధికారి

## 18ఏళ్లు నిండిన ప్రతి ఒక్కరూ ఓటు హక్కు నమోదు చేసుకోవాలి:అదనపుకలెక్టర్

**గద్వాల, అక్టోబరు 29 ప్రభాతవార్త:** 18 ఏళ్లు నిండిన ప్రతి ఒక్కరికి ఓటు హక్కు కల్పిస్తూ పకడ్బందీగా ఓటరు జాబితా రూపొందించాలని జిల్లా అదనపు కలెక్టర్ రెవెన్యూ లక్ష్మి నారాయణ అధికారులకు ఆదేశించారు. మంగళవారం ఐడిఓసిలోని తన ఛాంబర్‌లో ముసాయిదా ఓటరు జాబితాను రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో విడుదల చేయడం జరిగింది. ఈ సందర్భంగా జిల్లా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ 2025 జనవరి 1 నాటికి 18 ఏళ్లు నిండే ప్రతి ఒక్క రు ఓటు హక్కు నమోదు చేసుకునేలా చర్యలు చేపట్టాలన్నారు. నవంబర్ 9,10 తేదీలలో నిర్వహించే ప్రత్యేక క్యాంపెయిన్ తేదీలలో అన్ని పోలింగ్ బూతులలో బిఎల్వోలు అందుబాటులో ఉం టారని ఆ సమయంలో నూతన ఓటర్ల నమోదు చేసుకోవడానికి అవకాశం ఉంటుంది. కావున అందరూ తప్పకుండా వినియోగించుకోగలరని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏవో వీరభద్రప్ప, కలెక్టరేట్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.


సమావేశమైన అదనపు కలెక్టర్ లక్ష్మినారాయణ

## పేదలకు అండగా రాష్ట్ర ప్రభుత్వం...

**ఆత్మకూరు అక్టోబరు 29 ప్రభాతవార్త :** రాష్ట్రంలో పేద ప్రజలకు అండగా రాష్ట్ర ప్రభుత్వం పని చేస్తుందని మక్తల్ నియోజకవర్గ యువజన కాంగ్రెస్ అధ్యక్షులు తులసిరాజు యాదవ్ ఆత్మకూరు మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు పరమేష్ తదితరులు అన్నారు. పట్టణంలోని నాలుగో వార్డ్ కు చెందిన కురువ భారతి తీవ్ర అనారోగ్యంతో బాధపడు తున్న విషయాన్ని తెలుసుకున్న స్థానిక నాయకులు మక్తల్ శాసనసభ్యులు వాకిటి శ్రీహరి దృష్టికి తీసుకువెళ్లడంతో వెంటనే స్పందించిన శాసనసభ్యులు ముఖ్యమంత్రి సహాయనిధి కింద కురువభారతికి నాలుగులక్షల రూపాయల ఎల్ఓసిని అందించేందుకు స్థానిక నాయకులకు ఆదేశాలు జారీచేశారు. ఈమేరకు మంగళవారం సాయంత్రం ఆత్మకూరు పట్టణంలోని బాధితురాలి కుటుంబానికి వెళ్లి స్థానిక నాయకులు అందజేశారు. పేదవారిని ఆరోగ్యపరంగా ఆదుకునేందుకు నియోజకవర్గ శాసనసభ్యులు ఎల్లవేళలా అందుబాటులో ఉంటారని వారు అన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక కాంగ్రెస్ నాయ కులు అశోక్, నర్సింలు గౌడ్, కాజన్న, వెంకటేష్ తదితరులతో పాటుగా పలువురు నాయకులు పాల్గొన్నారు.


ఎల్ఓసి కాపీని అందజేస్తున్న తులసిరాజు యాదవ్


## కొత్తకోటలో మాజీ మంత్రులకు ఘన స్వాగతం

**కొత్తకోట అక్టోబరు 29 ప్రభాతవార్త :** వనపర్తి జిల్లా కేంద్రంలో రైతు దీక్ష నిరసన కార్యక్రమానికి ముఖ్యతిథులుగా విచ్చేయుచున్న తెలంగాణ రాష్ట్ర మాజీ మంత్రులు తన్నీరు హరిశరావు, శ్రీనివాస్ గౌడ్‌లను కొత్తకోటలో బిఆర్ఎస్ నాయకులు ఘన స్వాగతం పలికారు. ముందుగా శాలువా పూలమాలతో సత్క రించి వరి పైరులను అందజేసి ఘన స్వాగతం పలికారు. వనపర్తి జిల్లాలో మాజీ మంత్రి నిరంజన్ రెడ్డి తలపెట్టిన రైతు నిరసన కార్యక్రమానికి హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్ పర్సన్ పొగాకు సుకెసిని విశ్వేశ్వర్,మాజీ ఎంపీపీ గుంత మౌనిక, వైస్ చైర్మన్ జయమ్మ, మాజీ జెడ్పిటీసీలు వామన్ గౌడ్, విశ్వేశ్వర్, మాజీ సీడీసీ చైర్మన్ చెన్నకేశవ రెడ్డి, కౌన్సిలర్లు పద్మ అయ్యన్న, సంధ్య రవీందర్ రెడ్డి,ఖాజామైనొద్దీన్,పండ్ల రాములు యాదవ్, మన్యం యాదవ్, నాగన్న సాగర్, కొండారెడ్డి, గాడిల ప్రశాంత్, శ్రీనుజీ, నెహ్రు, లాలు, వాజీద్,వసీం తదితరులు పాల్గొన్నారు.


మాజీ మంత్రులకు ఘన స్వాగతం పలుకుతున్న బిఆర్ఎస్ శ్రేణులు


## పదవి విరమణ కార్యక్రమంలో అక్కి శ్రీనివాస్ గౌడ్

**పెబ్బేరు అక్టోబరు 29 ప్రభాతవార్త :** పెబ్బేరు పట్టణానికి చెందిన ఉపాధ్యాయుడు ఖాజ మైనుద్దిన్ పదవి విరమణ కార్యక్రమం పెబ్బేరు మండలం యాపర్ల జిల్లా పరిషత్ హైస్కూల్లో ఘ నంగా నిర్వహించారు. జిల్లా బ్లాక్ అధ్యక్షులు అక్కి శ్రీనివాస్ గౌడ్ పాల్గొని శాలువా కప్పి పు లదండ వేయడం జరిగింది. వా రు పిల్లలకి చేసిన మంచితనం సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ డైరెక్టర్ రాములు, వర్కింగ్ ప్రెసిడెంట్ వెంకటేష్ సాగర్, బోయ సత్తి,బుర్రమోని రాములు బసవరాజ్ గౌడ్, వనం మల్లేష్,పెబ్బేర్ పట్టణ పూర ప్రముఖులు, పిఆర్టియు, యుటిఎఫ్ ఉపాధ్యాయ సంఘాలు,పెద్దలు ఉపాధ్యాయులు, విద్యార్థులు గ్రామ పెద్దలు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.


ఉపాధ్యాయుడు మైనద్దీన్ ను సన్మానిస్తున్న కాంగ్రెస్ నాయకులు

## కొత్త మండలాలకు రాష్ట విద్యాశాఖ నుండి పూర్తి సదుపాయాలు కల్పించాలి

**కృష్ణ,అక్టోబరు 29 ప్రభాతవార్త :** తెలంగాణ రాష్ట్ర విద్యాశాఖ ఆధ్వర్యంలో నేడు రాష్ట్రంలోని అన్ని మండలాల విద్యాధికారులకు అకాడమిక్ అండ్ అడ్మినిస్ట్రేషన్ తదితర అంశాలపై నిర్వహిస్తున్న ఒకరోజు ఓరియంటేషన్ కార్యక్రమంలో నారాయణపేట జిల్లాలో చాలా సంవత్సరాల క్రిందట ఏర్పాటు చేసిన కొత్త మండలాలైన కృష్ణ, మరికల్, గుండుమాల్, కొత్తపల్లిలో మండల వనరుల కేంద్రాలు,. మెయింటెనెన్స్ నిధులు, నిర్వహణ సిబ్బంది తదితరాలు తక్షణమే మంజూరు చేయాలని రాష్ట్ర విద్యాశాఖ కమిషనర్ ఈవి నరసింహారెడ్డికి వినతిపత్రం అందజేసి, ప్రస్తుతం కొత్త మండలాలలో ఎదురవుతున్న సమస్యలను వారి దృష్టికి తీసుకెళ్లి సమస్యల పరిష్కారం కోసం కృషి చేయడం జరిగిందని సంబంధిత అధికారులకు సమస్యల పరిష్కారం కోసం తగిన సూచనలు చేస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో కృష్ణ మండల విద్యాధికారి నిజాముద్దిన్, గుండుమాల్ మండల విద్యాధికారి శేఖర్‌రెడ్డి, కొత్త మండల విద్యాధికారి ఆర్.ఆంజనేయులు, మండల విద్యాధికారి అనిల్‌గౌడ్ తదితరులు ఉన్నారు.


వినతి పత్రం అందజేస్తున్న దృశ్యం

# త్వరలో పియూలో కృతిమ మేధ కోర్సులు

**మహబూబ్‌నగర్ బ్యూరో,అక్టోబరు 29 ప్రభాత వార్త :** సైన్స్ సబ్జెక్టులు అన్నింటికి మూలము గణిత శాస్త్రమేనని, గణితశాస్త్ర విశ్లేషణ లేకుండా రీసెర్చ్ మనుగడ లేదని, త్వరలో కృత్రిమ మేధా కోర్సులు ప్రవేశపెడతామని పాలమూరు విశ్వవిద్యాలయ ఉపకులపతి శ్రీనివాస్ వెల్లడించారు. పియు గణితశాస్త్ర విభాగం ఆధ్వర్యంలో లైబ్రరీ ఆడిటోరియంలో టీజీ కాస్ట్ సౌజన్యంతో జాతీయ గణిత దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఉపకులపతి శ్రీనివాస్ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. మారుతున్న కాలానుగుణంగా గణితంలో విద్యార్థులు పట్టు సాధించాలని అన్నారు. ముఖ్య వక్త ప్రొ॥ ప్రసన్నకుమారదేవన్గిరి యూనివర్సిటీ కర్ణాటక వారు మాట్లాడుతూ గణిత శాస్త్రంలో కంప్యూటేషనల్ టెక్నిక్స్‌ని ఏ విధంగా ఉపయోగించాలి, గణితశాస్త్ర విద్యార్థులకు,బోధన రంగంలోనే కాకుండా పరిశ్రమలో కూడా ఉపాధి అవకాశాలు మెండుగా ఉంటాయని, విద్యార్థులు గణితం అంటే భయపడకూడదని కొంత శ్రమ పడితే గణితంలో అద్భుత ఫలితాలు సాధించవచ్చని ప్రపంచంలో గణితశాస్త్రంలో భారతదేశానికి మంచిపేరు ఉందని, లెటెస్క్స్, మ్యాథమేటికా, మాథమాటి, ల్యాబ్ ఫోనిక్స్ అనే సాఫ్ట్‌వేర్‌ను ఉపయోగించి, పరిశోధనలు కొనసాగించవచ్చని, ఈ సాఫ్ట్‌వేర్ అధ్యయనం కొరకు పియు విద్యార్థులకు ఒకవారం పాటు ఉచిత క్లాసులు నిర్వహిస్తారని అన్నారు. అనంతరం వ్యాసరచన, ఉపన్యాస క్విజ్ పోటీలలో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు ప్రధానం చేశారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ డా. మధుసూదన్‌రెడ్డి, ఛైర్మన్ డా. చంద్రకిరణ్, కన్వీనర్ డా. రవిందర్‌రెడ్డి, కో కన్వీనర్ డా. మధు, కో ఆర్డినేటర్స్ బి.నాగరాజు, బి. సురేష్, ఆర్గనైజింగ్ సెక్రెటరీ భారతి, అశోక్‌కుమార్, డా. యాదగిరి, వివిధ విభాగాల అధిపతులు, అధ్యాపకులు, పిఆర్ఓ డా. రవికుమార్, వివిధ పిజి సెంటర్ల అధ్యాపకులు, విద్యార్థులు అధిక సంఖ్యలో హాజరయ్యారు.

### జాతీయ గణిత దినోత్స వేడుకలలో ఉపకులపతి శ్రీనివాస్



మాట్లాడుతున్న వీసీ శ్రీనివాస్

## పార్టీ మారిన కౌన్సిలర్లకు నోటీసులు..

### బిఆర్ఎస్ పార్టీ జడ్చర్ల టౌన్ అధ్యక్షుడు పిట్టల మురళి

**జడ్చర్ల,అక్టోబరు 29 ప్రభాతవార్త :** బిఆర్ఎస్ పార్టీ గుర్తుపై గెలిచి కాంగ్రెస్ పార్టీలో చేరిన కౌన్సిలర్లపై చర్యలు తీసుకుంటామని బిఆర్ఎస్ జడ్చర్ల పట్టణ అధ్యక్షుడు పిట్టల మురళి తెలిపారు. జడ్చర్ల మున్సిపల్ ఎన్నికల్లో టిఆర్ఎస్ పార్టీ సభ్యత్వంతో పార్టీ గుర్తుపై గెలిచిన నలుగురు కౌన్సిలర్లు ఫహిమినాజ్ (1వ వార్డు), సుంకసారి రమేష్ (6వ వార్డు)చైతన్య చౌహాన్ (9వ వార్డు), శ్రావణి(20వ వార్డు)కు సంబంధించిన నలుగురు కౌన్సిలర్లు బిఆర్ఎస్ పార్టీ గుర్తుపై గెలిచి అనంతరం కాంగ్రెస్ పార్టీలో చేరిన సందర్భంగా జడ్చర్ల మాజీ ఎమ్మెల్యే డా.సి.లక్ష్మారెడ్డి స్వగృహంలో మీడియా సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడారు. 2021లో జరిగిన మున్సిపల్ ఎన్నికల్లో బిఆర్ఎస్ 27వ వార్డులో 23 కౌన్సిలర్లను బిఆర్ఎస్ పార్టీ దక్కించుకుందని అనంతరం నలుగురు కౌన్సలర్లు పార్టీ ఫిరాయింపులు చేసినందుకు వారిపై చర్యలు తీసుకుంటామని అన్నారు. మున్సిపల్ ఛైర్మన్ ఎన్నికకు బిఆర్ఎస్ పార్టీకి బలముందని పేర్కొన్నారు. విప్ జారీ చేసిన సమయంలో సభ్యత్వం రద్దవుతుందని ఆయన అన్నారు. పార్టీ మారిన కౌన్సిలర్లకు నోటీసులు ఇచ్చినట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ జడ్పీ వైస్ ఛైర్మన్ కొడుగల్ యాదయ్య, రాంమోహన్, సర్పంచ్‌ల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ప్రణీల్ చందర్, హఫీజ్ వుర్ రహెమాన్, గడ్డం ఖలిబ్, మండల పార్టీ అధ్యక్షుడు రఘుపతిరెడ్డి, మాజీ ముడా డైరెక్టర్ ఇమ్ము, బాలు ముదిరాజ్ పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న పిట్టల మురళి

## ర్యాగింగ్‌కు పాల్పడితే చట్టపరంగా కఠిన చర్యలు..

**నారాయణపేటటౌన్,అక్టోబరు29 ప్రభాతవార్త:** ర్యాగింగ్‌కు పాల్పడితే చట్టపరంగా కఠిన చర్యలు తప్పవని షీ టీమ్ బాలరాజు, చెన్నయ్య అన్నారు. జిల్లా ఎస్పీ యోగేష్ గౌతమ్ ఆదేశాల మేరకు మంగళవారం నారాయణపేట జిల్లా కేంద్రంలోని స్ఫూర్తి డిగ్రీ కళాశాలలో విద్యార్థులకు ఈవ్‌టీజింగ్, ర్యాగింగ్స్, డ్రగ్స్, గంజాయి, ట్రాఫిక్ చట్టాలు, సెల్‌ఫోన్ వినియోగం వల్ల ఏర్పడే అనర్థాలు, పోటీ పరీక్షల గురించి, లీడర్‌షిప్ లక్షణాలు, సైబర్ నేరాలు, బాల్య వివాహాలు తదితర విషయాలపై విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా షీ టీమ్ పోలీసులు బాలరాజు, చెన్నయ్యలు మాట్లాడుతూ విద్యార్థులు బాగా చదువుకొని ఉన్నత ఉద్యోగాలు సాధించాలని అన్నారు. కాలేజీల్లో ఈవ్‌టీజింగ్, ర్యాగింగ్ వల్ల విద్యార్థులు భయంతో సూసైడ్ చేసుకునే అవకాశాలుంటాయని అలాంటి వాటికి దూరంగా వాటి వల్ల చాలా మంది విద్యార్థులు చదువులు మధ్యలో ఆపేయడం జరుగుతుంది. ఎవరైనా ర్యాగింగ్‌కు పాల్పడితే పేట షీటీం సెల్ నంబర్ 8712670398 కు సమాచారం ఇవ్వాలని కోరారు. అలాగే విద్యార్థులు మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలని గంజాయి, డ్రగ్స్‌కు బానిసలై తమ లక్ష్యాలను నెరవేర్చుకోక ఇతర చెడు వ్యసనాలకు అలవాటు పడడం జరుగుతుందన్నారు. విద్యార్థులు శారీరకంగా, మానసికంగా దృఢంగా ఉండాలంటే ప్రతిరోజు గేమ్స్ ఆడాలని ఏదో ఒక గేమ్‌పై మక్కువ చూపాలని, క్రీడలు ఆడడం వల్ల లీడర్‌షిప్ లక్షణాలు పెంపొందుతాయని తెలిపారు. ప్రతి ఒక్కరు లీడర్‌షిప్ లక్షణాలు కలిగి ఉండాలని సూచించారు. కార్యక్రమంలో షీటీమ్ పోలీసులు, లెక్చరర్స్, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.


విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న షీటీం పోలీసులు

## కలెక్టర్ చొరవతో పత్తి కొనుగోలు కేంద్రం ఏర్పాటు..

### పత్తి కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించిన మార్కెట్ కమిటి ఛైర్మన్,వైస్ ఛైర్మన్‌లు

**నారాయణపేట టౌన్,అక్టోబరు 29 ప్రభాతవార్త :** పత్తి పండించిన రైతులు కొనుగోలు కేంద్రంలో విక్రయించి గిట్టుబాటు ధరను పొందాలని మార్కెట్ కమిటి ఛైర్మన్ శివారెడ్డి, కోనంగేరి హనుమంతులు అన్నారు. మంగళవారం నారాయణపేట మండలం అప్పక్‌పల్లి గ్రామం మారుతి మిల్‌లో పత్తి కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. అనంతరం వారు మాట్లాడుతూ ఎమ్మెల్యే పర్ణికరెడ్డి, జిల్లా కలెక్టర్ సిక్తా పట్నాయక్ చొరవతో కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. పత్తి పండించిన రైతులు ప్రైవేట్ విక్రయ కేంద్రాలలో అమ్ముకోకుండా కొనుగోలు కేంద్రాలలో విక్రయించి గిట్టుబాటు ధరలు పొందాలన్నారు. రైతులు కొనుగోలు కేంద్రాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. రైతుల సంక్షేమాన్ని కోరే పార్టీ కాంగ్రెస్ అన్నారు. కాంగ్రెస్ పార్టీ హయాంలోనే అన్ని వర్గాల వారికి న్యాయం జరుగుతుందన్నారు. అడగగానే స్పందించిన ఎమ్మెల్యే పర్ణికరెడ్డి, కలెక్టర్ సిక్తా పట్నాయక్‌లకు కాంగ్రెస్ పార్టీ నాయకులు, రైతులు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో డైరెక్టర్లు శరణప్ప, వెంకటయ్య, మార్కెట్ యార్డు సెక్రెటరీ, అధికారులు, రైతులు పాల్గొన్నారు.


కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న దృశ్యం

## డ్రైవింగ్ చేసే సమయంలో అప్రమత్తంగా ఉండాలి

**నారాయణపేట టౌన్,అక్టోబరు 29 ప్రభాతవార్త :** డ్రైవింగ్ చేసే సమయంలో అప్రమత్తంగా ఉండాలని ఎంటిఓ ఆర్.ఎస్సై శివశంకర్ అన్నారు. జిల్లా ఎస్పీ యోగేష్ గౌతమ్ ఆదేశాల మేరకు మంగళవారం జిల్లా ఎస్పీ కార్యాలయంలోని ట్రైనింగ్ సెంటర్‌లో ఎంపిఓ ఆర్ ఎస్సై శివశంకర్ ఆధ్వర్యంలో జిల్లాలోని పోలీస్ మోటార్ వాహన డ్రైవర్లకు ఒకరోజు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా ఆర్ ఎస్సై శివశంకర్ మాట్లాడుతూ జిల్లా పోలీస్ స్టేషన్లలో పెట్రోల్ కార్ విధులు నిర్వర్తించే వాహన డ్రైవర్లు పెట్రోలింగ్ వాహనాన్ని నిరంతరం పెట్రోలింగ్ నిర్వహిస్తూ ఉండాలని, రాత్రి పెట్రోలింగ్ చేసే సమయంలో తమకు కేటాయించిన పోలీస్ స్టేషన్ పరిధిలో నిర్విరామంగా పెట్రోలింగ్ నిర్వహిస్తూ నేరస్తులపై నిఘా ఏర్పాటు చేయాలని, ముందస్తు నేరాలు జరగకుండా సైరన్ వేసుకుంటూ పెట్రోలింగ్ నిర్వహించాలని, వాహనానికి ఏదైనా సమస్య వస్తే వెంటనే మా దృష్టికి తీసుకురావాలని కోరారు. ప్రతి ఒక్కరు డ్రైవింగ్ చేసే సమయంలో అప్రమత్తంగా ఉండాలని, వాహనాల మెకానిజంపై పూర్తి అవగాహన కలిగి ఉండాలని తెలిపారు. కార్యక్రమంలో జిల్లాలోని మోటార్ వాహన డ్రైవర్లు తదితరులు పాల్గొన్నారు.


డ్రైవింగ్‌పై అవగాహన కల్పిస్తున్న దృశ్యం

## అండర్ 14 జట్టుకు ఆత్మకూరు విద్యార్థి ఎంపిక...

**ఆత్మకూరు అక్టోబరు 29 ప్రభాతవార్త :** మండల కేంద్రమైన ఆత్మకూరు పట్టణం లోని జెడ్పిహెచ్‌ఎస్ బాలికల ఉన్నత పాఠశాల లో 8 వ తరగతి విద్యను అభ్యసిస్తున్న విద్యార్థిని కావ్య సందర్భంగా ఎంపికైనట్లుగా కోచ్ మురళి అధికారులకు తెలిపారు ఉమ్మడి మహబూబ్‌నగర్‌లో జరుగుతున్న సందర్భంగా బాలికల కోకో జట్టుకు సంబంధించి రాష్ట్ర స్థాయి పోటీలకు కావ్య ఎంపిక కావడం పట్ల ఆత్మకూరు ఎంఈఓ కొండాపురం బాలరాజు ఉపాధ్యాయ బృందం తదితరులు విద్యార్థిని ఘనంగా సత్కరించారు. విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లో రాణించేందుకు ప్రభుత్వం అన్ని విధాలుగా సహాయ సహకారాలు అందించగలుగుతుందని ఎంఈఓ బాలరాజు పేర్కొన్నారు.


అండర్ 14 కోకో జట్టుకు ఎంపికైన విద్యార్ధినిని సత్కరిస్తున్న దృశ్యం

## దశ దిన కర్మకు హాజరైన ఎమ్మెల్యే

**గద్వాల అక్టోబరు 29 ప్రభాతవార్త:** గద్వాల నియోజకవర్గం ధరూర్ మండల పరిధిలోని నాగర్‌దొడ్డి గ్రామంలో మాజీ వైస్ ఎంపీపీ, ఆలయం కమిటీ మాజీ చైర్మన్, వెంకట్రామిరెడ్డి తండ్రి కీ.శే. కొత్తమాలె లక్ష్మిరెడ్డి దశదిన కర్మ సందర్భంగా ఆయన చిత్రపటానికి ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి పూలమాల వేసి నివాళులర్పించారు. ఆయన ఆత్మకు శాంతి కలగాలని భగవంతుని ప్రార్థించారు. ఎమ్మెల్యే వెంట జిల్లా గ్రంథాలయమాజీ చైర్మన్ జంబు రామన్ గౌడ్, జిల్లా కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు గడ్డం కృష్ణరెడ్డి, వెంకట్రామిరెడ్డి, నాయకులు భీమ్‌రెడ్డి, నవీన్ రెడ్డి నాయకులు, కార్యకర్తలు తదితరులు ఉన్నారు.


లక్ష్మిరెడ్డికి నివాళులు అర్పిస్తున్న ఎమ్మెల్యే

## ఐకెపి ఎపిఎంగా మల్లేష్


మల్లేష్‌ను అభినందిస్తున్న ఎంపిడిఓ

**కోయిల్‌కొండ,అక్టోబరు 29 ప్రభాతవార్త :** మండల ఐకెపి ఇంఛార్జి ఎపిఎంగా మల్లేష్ మంగళవారం పదవీ బాధ్యతలు చేపట్టారు. ఈ మేరకు ఎంపిడిఓ కాళప్ప తన చాంబర్‌లో నూతనంగా పదవిబాధ్యతలు చేపట్టిన ఇంఛార్జి ఐకెపి ఎపిఎం మల్లేష్‌ను సన్మానించి అభినందించారు. కోయిల్‌కొండ ఐకెపి ఏపిఎంగా విధులు నిర్వహిస్తున్న విజయకుమారి బదిలీపై రాజాపూర్ వెళ్లారు. ఐకెపి కార్యాలయంలో సీసీగా విధులు నిర్వహిస్తున్న మల్లేష్ ఇంఛార్జి ఐకెపి ఎపిఎంగా బాధ్యతలు స్వీకరించారు. ఏపీఎంగా బాధ్యతలు స్వీకరించిన మల్లేష్‌ను కార్యాలయ సిబ్బంది,అధికారులు శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎపిఓ నరసయ్య,సిసిలు నరేష్,బద్రునాయక్,సంతోష్,బుక్ కీపర్ టి.రాములు, అటెండర్ రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## బదిలీపై వెళ్తున్న జాయింట్ కలెక్టర్‌కు నగేష్‌ను ఘన సన్మానం

**కొత్తకోట అక్టోబరు 29 ప్రభాతవార్త :** వనపర్తి జిల్లా జాయింట్ కలెక్టర్ గా 8 నెలల పాటు పని చేసి బదిలీపై వెళ్తున్న మెంచు నగేష్‌ను మంగళవారం జిల్లా కలెక్టర్ కార్యాలయంలో రాష్ట్ర రైస్ మిల్లర్స్ అసోసియేషన్ కోశాధికారి విశ్వనాథం వెంకటరమణ శాలువా పూలమాలతో ఘనంగా సన్మానించారు. తక్కువ కాలంలో ఎక్కువ పని చేసి అందరి ఆధారాభిమానాలు పొందారని వారిసేవలను కొనియాడారు. మీరు చేసిన సేవలు వనపర్తి ప్రజలు ఎప్పుడు గుర్తించుకుంటారని చెప్పారు. ఎక్కడ మీ బాధ్యతలు నిర్వర్తించిన ఆయురారోగ్యాలతో ఉండాలని కోరారు.




## మృతురాలి కుటుంబానికి ఆర్థిక చేయూత నందించిన ఎమ్మెల్యే


నగదు అందజేస్తున్న కాంగ్రెస్ పార్టీ నాయకులు

**పెబ్బేరు అక్టోబరు 29 ప్రభాతవార్త :** పెబ్బేర్ మండలం సూగూరు గ్రామానికి చెందిన తెలుగు బీసమ్మ మరణించిన తర్వాత భర్త శాంతన్న దిగులతో అనారోగ్యానికి గురి అయినందువలన కాంగ్రెస్ పార్టీ శ్రేణుల ద్వారా తెలుసుకున్న వనపర్తి శాసనసభ్యులు తూడి మేఘారెడ్డి స్పందించి వారి కుటుంబానికి ఖర్చుల నిమిత్తం 5000 రూపాయలను గ్రామ కాంగ్రెస్ పార్టీ శ్రేణుల ద్వారా వారి కుటుంబానికి అందజేయడం జరిగింది. కార్యక్రమంలో పెబ్బేర్ మార్కెట్ నరసింహనాయుడు,రామలక్ష్మణ్ , మండగిరి రాముడు, స్వామి,గొల్ల నిరంజన్,కుమ్మరి ఎల్లస్వామి గొల్లసహదేవుడు తదితరులు పాల్గొన్నారు.

## ప్రధాని శంకుస్థాపనను వీక్షించిన భూత్పూర్ పీహెచ్‌సీ వైద్యులు,సిబ్బంధి


ఎల్‌సీడీ టెలివిజన్‌లో ప్రధాని శంకుస్థాపనలు ప్రదర్శిస్తున్న దృశ్యం

**భూత్పూర్,అక్టోబరు 29,ప్రభాతవార్త :** ప్రధాని నరేంద్ర మోడీ మంగళవారం శంకుస్థాపన చేసి జాతికి అంకితం చేసిన ఆరోగ్య మౌలిక సదుపాయాల ప్రాజెక్టుల దృశ్యాలను ఎల్‌సీడీ టెలివిజన్ ద్వారా భూత్పూర్ పీహెచ్‌సీ వైద్యులు డాక్టర్ మొహ్మద్ అబ్దుల్ రబ్,యునాని వైద్యులు డాక్టర్ జహీరొద్దిన్,సీహెచ్‌ఓ అయూబ్ ఖాన్ ఇతర వైద్య అధికారులు,సిబ్బంది భూత్పూర్ పీహెచ్‌సీలో ఏర్పాఉ చేసి ఎల్‌సీడీ టెలివిజన్‌లో వీక్షించారు.


ప్రధాని శంకుస్థాపనను వీక్షిస్తున్న పీహెచ్‌సీ వైద్యులు,ఆరోగ్య సిబ్బంది

## చెకుముఖి సైన్స్ సంబరాలు విజయవంతం చేయాలి

◆ రాష్ట్ర ఉపాధ్యక్షుడు జితేందర్ గౌడ్



చెకుముఖి టెస్ట్ టాలెంట్ వాల్ పోస్టర్‌ను విడుదల చేస్తున్న నాయకులు

**వీపనగండ్ల అక్టోబరు 29 ప్రభాతవార్త:** చెకుముకి టాలెంట్ సైన్స్ సంబరాలను పాఠశాలల్లో విజయవంతం చేయాలని జన విజ్ఞాన వేదిక రాష్ట్ర ఉపాధ్యక్షుడు జితేందర్‌గౌడ్ కోరారు. ఆయన మంగళవారం నాడు జనవిజ్ఞాన వేదిక సైన్స్ టెస్ట్ వాల్ పోస్టర్ని విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థుల్లో మూఢ నమ్మకాలకు వ్యతిరేకంగా వారిలో ఉండే నైపుణ్యాన్ని వెలికి తీయడం కోసం టాలెంట్ టెస్ట్ నిర్వహిం చడం జరుగుతుందని ఆయన తెలిపారు. సైన్సు విద్యార్థులకు ఎంతో అవసరమని దానిపై వారికి అవగాహన కల్పించాల్సి నటువంటి అవసరం ఎంతైనా ఉన్నదని ఆయన ఈ సందర్భంగా తెలిపారు. ఈ టాలెంట్ టెస్ట్ వీపనగండ్ల మండల కేంద్రంలో నవంబర్ 7న జరగబోయే చెకుముకి సైన్స్ సంబరాలు విజయవంతం చేయాలని మంగళవారం గర్ల్స్ హైస్కూల్లో జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో వాల్ పోస్టర్ ను విడుదల చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో జన విజ్ఞాన వేదిక రాష్ట్ర ఉపాధ్యక్షుడు జితేందర్ గౌడ్ జిల్లా ఉపాధ్యక్షుడు రఘు, మండల అధ్యక్షుడు రవీందర్, కార్యదర్శి శివకృష్ణ, జిహెచ్ఎం భాను ప్రకాష్, శ్రీనివాసులు, మధుసూదన్ రెడ్డి, హేమలత,అరుణ, బక్కన్న,పరుశ రాముడు పాల్గొన్నారు.

## వికలాంగులకు 6000 పెన్షన్ చెల్లించాలి



సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా అధ్యక్షులు ప్రభాకర్‌శెట్టి

**ఆత్మకూరు అక్టోబరు29 ప్రభాతవార్త:** రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గత శాసనసభ ఎన్నికల ముందు వికలాంగులకు 6000 పెన్షన్ ప్రతినెలా చెల్లిస్తామని ఇచ్చిన హామీ మేరకు తక్షణమే హామీని నిలబె ట్టుకోవాలని మన ప్రతి జిల్లా వికలాంగుల హక్కుల పోరాట సమితి జిల్లా అధ్యక్షులు భీమా ప్రభాకర్ శెట్టి విజ్ఞప్తి చేశారు. మంగళవారం రోజు మండల కేంద్రమైన ఆత్మకూరు పట్టణంలో జరిగిన వికలాంగుల సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు.ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూఎన్నికల ముందు ఇచ్చిన హామీని నిలబెట్టుకునేందుకు ముఖ్యమంత్రి తక్షణమే చర్యలు చేపట్టాలని లేని పక్షంలో నవంబర్ 26 వ తేదీన ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షులు మందకృష్ణమాదిగ చేపట్టిన మహా ధర్నా కార్యక్రమానికి జిల్లా నుండి వేలాదిగా తరలివస్తామని ఆయన హెచ్చరించారు. అనంతరం ఆత్మకూరు మండల నూతన వికలాంగుల హక్కుల సంఘం అధ్యక్షులుగా లక్ష్మీనారాయణ ఉపాధ్యక్షులుగా హుస్సేన్ తదితరులను ఎంపిక చేసినట్లుగా ఆయన తెలిపారు.

## కల్వరాలలో ముగ్గురు జూనియర్ లెక్చరులుగా ఎంపిక



హిమబిందు



రాముడు



భరత్

**వీపనగండ్ల అక్టోబరు29 ప్రభాతవార్త:** మండలంలోని కల్వరాల గ్రామానికి చెందిన ముగ్గురు జూనియర్ లెక్చరులుగా ఎంపిక అయినట్లు గ్రామస్తులు తెలిపారు. ఇటీవల జూనియర్ లెక్చరర్ పోస్టులను భర్తీ చేస్తూ ప్రభుత్వం రిజల్ట్ విడుదల చేసిన విషయం తెలిసిందే గత నుండి రాష్ట్ర ప్రభుత్వం విద్యకు ప్రాధా న్యతనిస్తూ పాఠశాలలకు ఉపాధ్యాయులను నియమించడానికి డీఎస్సీ నిర్వహించి వారిని త్వరితగతిన పోస్టులను కూడా భర్తీ చేసేటందుకోసం రిజల్ట్ విడుదల చేసినటువంటి విషయం తెలిసిందే ఈ సంద ర్భంలో కల్వరాల గ్రామానికి చెందిన హిమబిందు కామర్స్, రాముడు కెమిస్ట్రీ ,భరత్ హిస్టరీ ,జూనియర్ లెక్చర్‌గా ఎంపిక అయినట్లు వీరు ముగ్గురు తెలిపారు.అయితే ఆ గ్రామంలో ప్రభుత్వ కొలువులు ఏమిపడ్డా వాటికి ఏదో ఒక ఉద్యోగంలో తప్పకుండా ఎంపిక కావడం జరుగుతుందని గ్రామస్తులు తెలిపారు. ఈ సందర్భంగా ఒకే గ్రామంలో ముగ్గురు జూనియర్ లెక్చరర్‌గా ఎంపిక కావడం వల్ల హర్షం వ్యక్తం చేస్తున్నారు.ఇది గ్రామానికే గర్వకారణంగా ఉందని వారు అంటున్నారు.

## గాలికుంటు వ్యాధులకు టీకాలు



పశువులకు రక్తనామూనాలు సేకరిస్తున్న వైద్యాధికారులు

**వీపనగండ్ల అక్టోబరు29 ప్రభాత వార్త:** పశువులకు జబవాపు గాలికుంటు తదితర అంటు రోగాలు రావడాన్ని నివారించటం జరగాలి అని పశువైద్యాధికారి కర్ణశ్రీ అన్నారు. మండలం సంగినేనిపల్లి గ్రామ ములో మంగళవారం నాడు పశువులకు ఉచిత గాలికుంటు టీకాల కార్యక్రమంలో భాగంగా పశువులతో టీకాల యొక్క టైటర్ విలువ తెలుసు కొనుటకు పశువులతో ఫ్రీ సేర నమూనాలు (రక్త నమూనా) సేకరిం చటానికి మహబూబ్‌నగర్ పశు వ్యాధి నిర్ధారణ కేంద్రంనుండి డా.కరుణ వచ్చి రక్త నమూనాలు సేకరిం చటం జరిగింది. డా.కరుణ శ్రీమాట్లాడుతూ పశువులకు గాలికుంటూ వ్యాధి సోకకూండా 3నెలలు దాటిన ప్రతి పశువులకి టీకాలు వేయించుకోవాలని సూచించటం జరిగింది. ఈకార్యక్రమంలో మండల వెటర్నరి డాక్టర్ జే గణేష్‌కుమార్,పశువైద్య సిబ్బంది శ్రీధర్, సత్యం, మధు, ఆశన్న, వెంకయ్య రైతులు పాల్గొన్నారు.

## క్రీడాకారులకు ఘన సన్మానం



క్రీడాకారులను అభినందిస్తున్న దృశ్యం

**మక్తల్,అక్టోబరు29 ప్రభాతవార్త:** ఇటీవల నారాయణఖేడ్‌లో జరిగిన రాష్ట్రస్థాయి జూనియర్ బాలుర షూటింగ్ బాల్ క్రీడల్లో జిల్లా జట్టు తరపున మక్తల్ మహాత్మా జ్యోతి రావు పూలె బాలుర గురుకుల పాఠశాల అంబేద్కర్ నగర్ విద్యార్థులు సాయితేజ, జయదీప్,చరణ్, ప్రశాంత్, రాజేష్, శివచరణ్, నవ దీప్ పాల్గొని రాష్ట్రస్థాయిలో క్రీడా ప్రతిభను చాటారు. ఈ సందర్భంగా మంగళవారం పాఠశాల ఆవర ణలో తెలంగాణ రాష్ట్ర షూటింగ్ బాల్ అసోసియేషన్ ఉపాధ్యక్షుడు బి.గోపాలం, పాఠశాల ప్రిన్సిపల్ రాములు చేతుల మీదుగాక్రీడాకారులకు ప్రశంసా పత్రాలు అందజేసి, పూలమాల, శాలువాలతో ఘనంగా సన్మానించి ప్రత్యేకంగా అభినందించారు. అనంతరం వారు మాట్లాడుతూ విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లో రాణిస్తే వారికి మంచి భవిష్యత్తు ఉంటుందని, స్పోర్ట్స్ కోటాలో ఉద్యోగాలు లభిస్తాయన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయ బృందం, విద్యార్థులు పాల్గొన్నారు.


## బిజెపి సభ్యత్వ నమోదు గడువు పొడిగింపు

### బిజెపి నియోజకవర్గ ఇంఛార్జి కొండ ప్రశాంత్‌రెడ్డి

**దేవరకద్ర,అక్టోబరు 29 ప్రభాతవార్త :** భారతీయ జనతా పార్టీ అధిష్టానం ఆదేశానుసారం పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని వచ్చేనెల 15 వరకు పొడిగించడం జరిగిందని ఆ పార్టీ దేవరకద్ర నియోజకవర్గం ఇంఛార్జి కొండ ప్రశాంత్‌రెడ్డి తెలిపారు. మహబూబ్‌నగర్ పార్లమెంట్ పరిధిలోని దేవరకద్ర నియోజకవర్గం పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమంలో మొదటి స్థానంలో నిలిచేలా పార్టీ ప్రతి నాయకుడు, కార్యకర్త కృషి చేయాలని ఆయన సూచించారు. పార్టీ సభ్యత్వ నమోదు అధికంగా చేయించిన వారికి పార్టీలో క్రియాశీలక పదవులతో పాటు వచ్చే స్థానిక సంస్థల ఎన్నికలలో పోటీ చేయడానికి మొదటి ప్రాధాన్యతను పార్టీ అధిష్టానం ఇస్తుందని ఆయన తెలిపారు. ఈ విషయాన్ని ప్రతి ఒక్కరూ గమనించాలన్నారు. కావున పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని పార్టీ నాయకులు, కార్యకర్తలు యుద్ధ ప్రాతి పదికన చేయించాలని కొండ ప్రశాంత్‌రెడ్డి సూచించారు.

## కబడ్డీ పోటీల సౌకర్యాలను పరిశీలించిన ఆర్గనైజర్ కమిటీ బృందం

**అడ్డాకుల,అక్టోబరు29 ప్రభాతవార్త:** మండల పరిధిలోని రాచాల గ్రామంలో 68వ ఎస్‌జిఎఫ్ రాష్ట్రస్థాయి కబడ్డి టోర్నమెంట్ పోటీలు 10 జిల్లాల నుండి అండర్ 17 బాలికలు, అండర్ 19 బాలురు నవంబర్ 3,4,5 తేదీలలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల రాచాలలో జరగనున్నాయి. టోర్నమెంట్‌కు సంబంధించిన ఎంఈఓ కురుమూర్తి ఆద్వర్యంలో నూతన ఆర్గనైజర్ కమిటీని నియమించారు. మంగళవారం పాఠశాల ప్రాంగణంలో ఆట స్థలాన్ని, క్రీడాకారులకు కావాల్సిన సౌకర్యాలను క్షుణ్ణంగా ఆర్గనైజర్ కమిటి బృందం పరిశీలించారు.రాచాల గ్రామంలో రాష్ట్రస్థాయి కబడ్డి పోటీలు నిర్వహించడం గర్వకారణమని గ్రామస్తుల సహకారంతో కబడ్డిపోటీలను దిగ్విజయంగా నిర్వహించడానికి జిల్లాలోని ప్రజలు పెద్ద ఎత్తున హాజరై కబడ్డి పోటీలను విజయవంతం చేయాలని కమిటి సభ్యులు తెలిపారు. కార్యక్రమంలో వివిధ పాఠశాలలజిహెచ్ఎంలు, హెచ్ఎంలు,ఉపాధ్యాయ సంఘాల నాయకులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



కబడ్డీ పోటీలకు సౌకర్యాలను పరిశీలిస్తున్న దృశ్యం

# సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వే విజయవంతంగా నిర్వహించాలి

■ వీసీలో ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క







విడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, హాజరైన కలెక్టర్ అధికారులు

**నారాయణపేట టౌన్,అక్టోబరు 29 ప్రభాతవార్త:** రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వే విజయవంతంగా నిర్వహించాలని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, ఆర్థిక, ఇంధన శాఖల మంత్రి మల్లుభట్టి విక్రమార్క అన్నారు. మంగళవారం రాష్ట్ర ఉప రాష్ట్రముఖ్యమంత్రి, ఆర్థిక, ఇంధన శాఖల మంత్రి మల్లు భట్టి విక్రమార్క ఖమ్మం జిల్లా మధిర తహసిల్దార్ కార్యాలయం నుంచి సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వేపై రాష్ట్ర ముఖ్య కార్యదర్శి శాంతికుమారి, ఇతర ఉన్నతాధికారులతో కలిసిఅ న్ని జిల్లాల కలెక్టర్లతో విడియో కాన్ఫరెన్స్ ద్వారా సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వేపై సమీక్షించారు. సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వే నిర్వహణకు తయారు చేసిన ప్రణాళిక, సర్వే ఉద్దేశం, జిల్లా స్థాయిలో కలెక్టర్లు తీసుకోవాల్సి న చర్యలు మొదలగు అంశాలను ఉప ముఖ్యమంత్రి వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వే (సామాజిక ఆర్థిక, విద్య, ఉపాధి,రాజకీయ, కుల సర్వే) నిర్వహణ విధి విధానాలను క్యాబినెట్ సమావేశంలో చర్చించి ఆమోదించామని అన్నారు. ఈ సర్వేలో ప్రజల సామాజిక, ఆర్థిక,విద్య,ఉపాధి, రాజకీయ, కుల వివరాలను సేకరిస్తామని అన్నారు. ప్రజా ప్రభుత్వం ఉన్నతమైన ఆలోచనలతో సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వే చేపడుతుందని, ఎస్సీ, ఎస్టీ ఇతర బలహీన వర్గాల అభ్యున్నతి కోసం వివిధ సామా జిక ఆర్థిక,విద్య, ఉపాధి,రాజకీయ అవకాశాల వారికి మెరుగు పరచడానికి తగిన ప్రణాళికలు తయారు చేసేందుకు ఈ సర్వే ఉపయోగిస్తామని ఉప ముఖ్యమంత్రి అన్నారు. రాష్ట్ర నీటిపారు దల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ సర్వే నిర్వహణ షెడ్యూల్ ప్రజలకు తెలిసేలా విస్తృత ప్రచారం కల్పించాలని అన్నారు.సర్వే పూర్తి చేసినఇంటికి స్టిక్కర్ అంటించాలని అన్నారు. నవంబర్ 6 నుంచి సర్వే ప్రారంభమవుతుందని నవంబర్ నెల చివరి వరకు ప్రతి ఇంటి సర్వే పూర్తిచేసి వివరాలు ఆన్‌లైన్‌లో పక్కాగా నమోదు చేయాలని అన్నారు. మంత్రి జూపల్లి కృష్ణారావు మాట్లాడుతూ ఎన్యుమరేటర్‌లతో ఇంటింటి సర్వే నిర్వహించడం ఎంత ముఖ్యమో, ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి డాటా ఎంట్రీ వివరాలను ప్రాప్తి చేయడం అంతే ముఖ్యమని అన్నారు. అనంతరం ధాన్యం కొనుగోలుపై మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి సమీక్షించారు. సీఎస్ శాంతికుమారి మాట్లాడుతూ జిల్లా యంత్రాంగం సమన్వయంతో సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వే నిర్వహణ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని అన్నారు. జిల్లా కలెక్టర్ బాధ్యతలు స్పష్టంగా తెలియజేస్తామని ఏ ఇండ్లు మిస్ కాకుండా ఇండ్ల జాబితా ప్రక్రియ పూర్తి చేయాలని, షెడ్యూల్ రూపకల్పన, స్టిక్కర్ అవసరమైన సామాగ్రి సేకరణపూర్తి చేయాలని ఆదేశించారు. రాష్ట్ర బిసి, రవాణా శాఖ మంత్రి పొన్నంప్రభాకర్ మాట్లాడుతూ సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వే నిర్వహణ చరిత్రలో నిలిచిపోయే ప్రక్రియ అవుతుందని అన్నారు. సర్వే నిర్వహణపై శాసనసభ తీర్మాణం ప్రవేశపెట్టి, క్యాబినెట్‌లో ఆమోదం పొంది సంబంధిత ఉత్తర్వులు జారీ చేశామని అన్నారు.ఈ విడియో కాన్ఫరెన్స్‌లో జిల్లా కలెక్టర్ సిక్తాపట్నాయక్, డిఆర్‌డిఓ మొగులప్ప, జిల్లా పంచాయతీ అధికారి కృష్ణ, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి జాన్ సుధాకర్, ఇంఛార్జి సిపిఓ శ్రీదేవి, సివిల్ సప్లై డిఎం దేవదాస్,సివిల్ సప్లై జిల్లా అధికారి సుదర్శన్, మున్సిపల్ కమిషనర్లసునిత, భోగేశ్వర్,అన్ని మండలాల ఎంపిడిఓలు పాల్గొన్నారు.

## మత్స్యకార కుటుంబాలను ఆర్థికంగా బలోపేతం చెయ్యడమే లక్ష్యం

■ సీడీసీ చైర్మన్ గొల్లబాబు,మండల అధ్యక్షుడు నాగారపు బీచుపల్లి



సంకిరెడ్డిపల్లిలో చేప పిల్లలను వదులుతున్న నాయకులు

**కొత్తకోట అక్టోబరు29 ప్రభాతవార్త:** మత్స్యకారుల కుటుంబాలను ఆర్థికంగా బలోపేతం చెయ్యడమే లక్ష్యం అని సీడీసీ చైర్మన్ గిల్లబాబు ,కాంగ్రెస్ మండల అధ్యక్షులు బిచుపల్లి యాదవ్ అన్నారు. మంగళవారం కొత్తకోట మండలం సంకిరెడ్డి పల్లి,చర్లపల్లి,అప్పరాల.పాముపురం, నాటవెల్లి గ్రామాల్లో చేప పిల్లల వదిలే కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దేవరకద్ర శాసనసభ్యులు జి.మధుసూదన్ రెడ్డి ఆదేశానుసారం ఈ కార్యక్రమం నిర్వహించామని తెలిపారు. ముదిరాజుల జీవితాల్లో వెలుగులు నింపాలని,సిఎం రేవంత్ రెడ్డి ఉచిత చేప పిల్లల పంపిణీ కార్యక్రమానికి శ్రీకారం చుట్టారన్నారు. ముదిరాజుల కుటుంబాలను ఆర్థికంగా బలోపేతం చెయ్యడమే కాంగ్రెస్ ప్రభుత్వం ధ్యేయమని,అంతేకాకుండా కులవృత్తుల వారు ఆర్థికంగా ఎదిగేందుకు గ్రామాలలో ముదిరాజుల భవిష్యత్తు కోసం వారి లాభాల కోసం ఇలాంటి కార్యక్రమాలు చేపడుతుందని అన్నారు. తదనంతరం మత్స్యకారుల ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ,దేవరకద్ర శాసనసభ్యులు జి.మధుసూదన్ రెడ్డికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.ఈ కార్యక్రమంలో అప్పరాల మాసన్న,ముస్తాఫా,మన్యం,బొందల ప్రశాంత్, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

## దీగ్రస్ నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీదే విజయం

### దీగ్రస్ నియోజకవర్గ ఎన్నికల సమన్వయకర్తగా వనపర్తి ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి



మాణిక్ రావ్ ఠాక్రే నామినేషన్ కార్యక్రమంలో పాల్గొన్న ఎంపీ మల్లు రవి,ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి

**వనపర్తి టౌన్ అక్టోబరు29 ప్రభాతవార్త:** మహారాష్ట్ర రాష్ట్రంలోని దీగ్రస్ నియోజకవర్గంలో జరుగుతున్న ఎమ్మెల్యే ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ బలపరిచిన మాణిక్ రావు ఠాక్రే ను అఖండ విజయం సాధిస్తారని అందుకు తాము అహర్నిశలు కష్టపడతామని వనపర్తి ఎమ్మెలే తూడి మేఘారెడ్డి పేర్కొన్నారు. కాంగ్రెస్ పార్టీ తనపై విశ్వాసం ఉంచి దీగ్రస్ నియోజకవర్గానికి ఎన్నికల సమన్వయకర్తగా తనను నియమించిందని తనపై ఉన్న నమ్మకాన్ని నిలబెట్టుకుంటానని ఎమ్మెల్యే ధీమా వ్యక్తం చేశారు. ఈ క్రమంలో మంగళవారం దీగ్రస్ నియోజకవర్గం ద్వారా తహశీల్దార్ కార్యాలయంలో కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి అయిన మాణిక్ రావు ఠాక్రే నామినేషన్ కార్యక్రమంలో ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి నాగర్‌కర్నూల్ ఎంపీ డాక్టర్ మల్లు రవి పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ ఎంతో నమ్మకంతో తమను దీగ్రస్ నియోజకవర్గ సమన్వయకర్త గా నియమించిందని మాణిక్ రావు ఠాక్రే ని భారీ మెజార్టీతో గెలిపించేందుకు తాము అన్ని విధాలుగా కృషి చేస్తామని పేర్కొన్నారు.

## విద్యార్థులు చట్టాలపై అవగాహన కలిగి ఉండాలి





చట్టాలపై విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న న్యాయసేవాధికారిని రజిని

**ఖిల్లాఘణపురం అక్టోబరు29 ప్రభాతవార్త:** విద్యార్థులు చదువుతో పాటు చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి రజని అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవరణలో జిల్లా న్యాయ సేవాధికర సంస్థ ఆధ్వర్యంలో విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మైనర్ పిల్లలు వాహనాలను నడపడం చట్టరీత్యా నేరమని వాహనదారులకు డ్రైవింగ్ లైసెన్స్ హెల్మెట్లు తప్పనిసరిగా ఉండాలన్నారు. త్రిబుల్ రైడింగ్ కు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటారని మైనర్ పిల్లలపై లైంగిక దాడులతె పాల్పడితే ఫోక్సో చట్టం ప్రకారం కఠిన శిక్షలు ఉంటాయన్నారు.బాల కార్మికుల చేత పనులు చేయించడం చట్ట వ్యతిరేకం అన్నారు. వేగంగా అభివృద్ధి చెందుతున్న సాంకేతిక టెక్నాలజీతో సైబర్ నేరాలు పెరిగిపోతున్నాయి అన్నారు. సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలని పిలుపునిచ్చారు. ఒక అదాలత్ ఆధ్వర్యంలో ఉచిత న్యాయ సేవలు అమలు అవుతున్నాయని వీటిని సద్వినియోగం చేసుకోవాలని చెప్పారు. లోకన అదాలత్ సేవలకు టోల్ ఫ్రీ నెంబర్ 15100 నంబర్ కు సంప్రదించాలన్నారు.లోక్ అదాలకు ఇరు వర్గాల కక్ష దారులకు రాజీ మార్గం ద్వారా సెటిల్మెంట్ చేయడం జరిగింది అప్పీల్ చేసుకునే అవకాశం లేదన్నారు. న్యాయ వాదుల సంఘం ఉపాధ్యక్షుడు దేగల కృష్ణయ్య మాట్లాడుతూ మహిళా సమస్యల పరిష్కారం కోసం ఎన్నో చట్టాలు ఉన్నాయని వాటిని ఉపయోగించుకుంటే ఎంతో ప్రయోజనం కలుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో సకి కేంద్రం నిర్వాహకురాలు ఏం కవిత మాట్లాడారు కళాశాల ప్రధానాచార్యులు రాజశేఖర్ కళాశాల సిబ్బంది విద్యార్థులు పాల్గొన్నారు.

## నందిమల్ల గ్రామ ప్రజల కల నెరవేర్చాము

### పిసిసి రాష్ట్ర అధికార ప్రతినిధి కేశం నాగరాజుగౌడ్




నందిమల్లలో రోడ్డును పరిశీలిస్తున్న పిసిసి రాష్ట్ర అధికార ప్రతినిధి

**అమరచింత అక్టోబరు 29 ప్రభాతవార్త:** ఎన్నికలలో కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీ మేరకు కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన వెంటనే చంద్ర గట్టు స్టేజి నుండి నందిమల్ల వరకు బీటీ రోడ్డు నిర్మాణానికి కోటి 40 లక్షలు నిధులు మంజూరు అయ్యాయని పిసిసి రాష్ట్ర అధికార ప్రతినిధి, కేశం నాగరాజుగౌడ్ తెలిపారు. మంగళవారం అమరచింత మండలంలోని నందిమల్ల రోడ్డును పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, మఖ్తల్ నియోజకవర్గం లో కాంగ్రెస్ పార్టీ వాకిటి శ్రీహరి ని గెలిపిస్తే నందిమల్ల గ్రామానికి బీటీ రోడ్డు వేస్తామని గ్రామ ప్రజలకు ఇచ్చిన హామీ ప్రకారం గ్రామ ప్రజల కల నెరవేర్చామని ఆయన తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలన్నిటిని అమలు చేస్తున్న ఓర్వలేని ప్రతిపక్ష పార్టీలు అసత్య ప్రచారాలు చేస్తున్నారని గత బిఆర్ఎస్ పాలనలో మండలంలో ఏ గ్రామానికి వెళ్లిన రోడ్లు లేక ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడ్డారని కాంగ్రెస్ ప్రభుత్వం గ్రామాలకు బీటీ రోడ్లు వేస్తుంటే ఓర్వలేక ప్రతిపక్షాలు గగోలు పెడుతున్నాయని ఆయన అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలన్నిటిని నెరవేరుస్తుందని ఆయన అన్నారు. నందిమల్ల గ్రామానికి బీటీ రోడ్డు నిర్మాణానికి కోటి 40 లక్షల నిధులు మంజూరు చేసిన రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి మఖ్తల్ నియోజకవర్గం ఎమ్మెల్యే వాకిటి శ్రీహరికి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు కేజీ మహేందర్ రెడ్డి కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షులు అరుణ్ కుమార్ నందిమల్ల గ్రామ కాంగ్రెస్ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

## ఉచిత చేప పిల్లల పథకాన్ని సద్వినియోగపరచుకోవాలి

◆ జిల్లా మత్స్యశాఖ అధికారిణి రజిని



చేప పిల్లలను పంపిణీ చేస్తున్న జిల్లా మత్స్యశాఖ అధికారిణి రజిని

**లింగాల,అక్టోబరు 29 ప్రభాతవార్త:** మత్స్యకారుల సంక్షేమం కోసం ప్రభుత్వం అమలు చేస్తున్న ఉచిత చేప పిల్లల పంపిణీ పథకాన్ని సద్వినియోగపరచుకుని మత్స్యకారులు ఆర్థికంగా ఎదగాలని జిల్లా మత్స్యశాఖ అధికారిణి రజిని సూచించారు. ప్రభుత్వం వందశాతం సబ్సిడీపై అందిస్తున్న చేప పిల్లల పంపిణీ కార్యక్రమం మంగళవారం అప్పాయిపల్లి గ్రామంలో నిర్వహించారు. అప్పాయిపల్లి గ్రామ మత్స్య పరిశ్రమ సహకార సంఘానికి 1,12,500ల చేప పిల్లలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గ్రామీణ ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేయడంతో పాటు కుల వృత్తులను ప్రోత్సహించాలనేది ప్రభుత్వ ఉద్దేశమన్నారు. మత్స్యకారులు ఆర్థిక స్వావలంబన సాధించడంలో భాగంగా రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా మత్స్య సహకార సంఘం సొసైటీలకు ఉచితంగా చేప పిల్లలను పంపిణీ చేస్తున్నదని గుర్తు చేశారు. కార్యక్రమంలో సొసైటీ అధ్యక్షులు సైదులు,ఉపాధ్యక్షులు యాదగిరి, సలేశ్వరం, శ్రీకాంత్, రాహుల్, సైదులు, వెంకటేష్ పాల్గొన్నారు.

## వెల్కిచర్లలో ఆయుర్వేద దినోత్సవం



మాట్లాడుతున్న ఆయుర్వేద వైద్యురాలు డాక్టర్ మాధురి

**భూత్పూర్,అక్టోబరు 29,ప్రభాతవార్త:** ఆయుర్వేదానికి ఆద్యుడు, దేవుడైన ధన్వంతరి జయంతి సందర్భంగా మంగళవారం భూత్పూర్ మండలం వెల్కిచర్లలో జిల్లా ఆయూష్, ఆయుర్వేదశాఖ నిర్వహించిన ఆయుర్వేద దినోత్సవంలో ధన్వంతరి యొక్క ప్రాముఖ్యతను,ఆయుర్వేదం యొక్క అవసరాన్ని వివరించారు.ఈ కార్యక్రమంలో ఆయుర్వేద వైద్యురాలు డాక్టర్ మాధురి,ఐసీడీఎస్ సూపర్‌వైజర్ మహేశ్వరి,సీడీపీఓ వెంకటమ్మ ఇతర వైద్య సిబ్బంధి పాల్గొన్నారు.

## ఇసుక ట్రాక్టర్ పట్టివేత

**మాగనూరు,అక్టోబరు 29 ప్రభాతవార్త:** మండల కేంద్రంలో మంగళవారం ఉదయం మాగనూరు పోలీస్ స్టేషన్ ఎస్సై ఉత్తర్వుల మేరకు పెట్రోలింగ్‌కు వెళ్లిన కానిస్టేబుల్‌కు అమ్మపల్లి గేటు సమీపంలో ఒక ట్రాక్టర్ ఇసుకతో వెళ్తుండగా ట్రాక్టర్‌ను ఆపి పరిశీలించగా అందులో ఇసుక ఉందని సమాచారం అడగగా డ్రైవర్, ఓనర్ తనేనని చెప్పడం జరిగింది. ఆ డ్రైవర్‌ను విచారించగా రాజశేఖర్‌రెడ్డి తండ్రి రాంరెడ్డి గ్రామం అడవి సత్యారం ట్రాక్టర్ నంబర్ కెఎ 36 టిబి 7853 అని చెప్పడంతో ఇసుకను తరలించడానికి గల ప్రభుత్వ అనుమతి పత్రాలు వివరాలు కోరగా ఎలాంటి ప్రభుత్వ అనుమతి లేకుండానే తరలిస్తున్నందుకు గాను ట్రాక్టర్లు, డ్రైవర్ రాజశేఖర్‌రెడ్డిని మాగనూరు పోలీస్ స్టేషన్‌కు తరలించి దొంగతనంగా ఇసుకను అక్రమంగా తరలిస్తున్న వారిపై చట్టరిత్యా చర్యలు తీసుకోవాలని సూచించారు.

### తెలంగాణ రాష్ట్ర రైస్ మిల్లర్స్ అసోసియేషన్ జాయింట్ సెక్రెటరీగా రామ్మోహన్ శెట్టి నియామకం

**గద్వాల అక్టోబరు29 ప్రభాతవార్త:** తెలంగాణ రాష్ట్ర రైస్ మిల్లర్స్ అసోసియేషన్ జాయింట్ సెక్రెటరి గా గద్వాల కు చెందిన రాంమోహన్ శెట్టి నియామకం అయ్యారు. రాంమోహన్ శెట్టి ని రైస్ మిల్లర్స్ అసోసియేషన్ రాష్ట్ర జాయింట్ కార్యదర్శిగా నియమిస్తూ అధ్యక్షులు గణపతిరెడ్డి మంగళవారం నియామక పత్రం అందజేశారు.రాంమోహన్ ఎంపిక పట్ల గద్వాల మిల్లర్స్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు, సభ్యులు హర్షం ప్రకటించారు.

## విద్యుత్ షాక్‌తో కాడెద్దుల మృతి



విద్యుత్ షాక్‌తో మృతి చెందిన కాడెద్దులు

**మక్తల్,అక్టోబరు 29 ప్రభాతవార్త:** వ్యవసాయ పొలం వద్ద ప్రమాదవశాత్తు విద్యుత్ షాక్‌కు గురై రెండు కాడెద్దులు మృతి చెందిన ఘటన మండలంలోని గుడిగండ్లలో మంగళవారం జరిగింది. గ్రామానికి చెందిన తిరుమలమ్మ వ్యవసాయ పొలం వద్ద ఎప్పటిలాగే కాడెద్దులను కట్టివేగా, సమీపంలోని విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ వద్ద విద్యుత్ తీగలు తగలడంతో కాడెద్దులు అక్కడికక్కడే మృతి చెందాయి. మృతి చెందిన కాడెద్దుల విలువ దాదాపు రూ.లక్షపైనే ఉంటుందని బాధితురాలు తెలిపారు. పశు వైద్య అధికారులు ఆంజనేయులు, మహేష్, పంచాయతీ కార్యదర్శి శైలజ, విద్యుత్ లైన్‌మెన్ సురెందర్ ఘటన స్థలాన్ని సందర్శించి పంచనామా నిర్వహించారు.

## టేబుల్ టెన్నిస్,చెస్ క్రీడలకు ఎంపికలు

**మహబూబ్‌నగర్,అక్టోబరు 29 ప్రభాతవార్త:** పాలమూరు యూనివర్సిటీ టేబుల్ టెన్నిస్ పురుషులు, చెస్ స్త్రీ, పురుషుల విభాగంలో క్రీడాకారులను సౌత్‌జోన్/ ఆలిండియా ఇంటర్ యూనివర్సిటీ టోర్నమెంట్‌లో పాల్గొనేందుకు ఈ ఎంపికలు చేశారని యూనివర్సిటి పిడి డా.వై.శ్రీనివాసులు తెలిపారు. ఎంపికైన క్రీడాకారులు విట్‌వేలూరు, వెల్‌టెక్ చెన్నై గీతమ్ యూనివర్సిటీలో జరిగే సౌత్‌జోన్/ ఆలిండియా ఇంటర్ యూనివర్సిటీ టోర్నమెంట్‌లో టేబుల్ టెన్నిస్‌పురుషులు జాన్‌పాల్, సాయి క్రిష్ణ,సంతోష్‌నాయక్, శ్రీకాంత్, బడేసాబ్‌లు ఎంపికయ్యారు. స్త్రీల విభాగంలో: పూజిత, నైనిష, హిమబిందు, అనిత, సుష్మితలు ఎంపిక కాగా చెస్ పురుషుల విభాగంలో ఆకాశ్ కుమార్, శివరాజ్,జితెందర్, హరీష్,వెంకటేష్‌లు ఎంపికైనట్లు యూనివర్సిటీ పిడి శ్రీనివాసులు తెలిపారు. కార్యక్రమంలో కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్ డా. రాజ్‌కుమార్ ముఖ్య అతిథిగా హాజరై విద్యార్థులు పలు సూచనలు చేశారు. అలాగే డా. సత్యభాస్కర్, డా. వెంకటరెడ్డి, డా. వై. శ్రీనివాసులు, చెస్ కోచ్ హేమంత్, పిడి ఆర్.శ్రీనివాసులు, మన్యం, శారద, నరేష్‌లు పాల్గొన్నారు.



## సీఎంకు కృతజ్ఞతలు తెలిపిన ఎమ్మెల్యే



**మక్తల్,అక్టోబరు 29 ప్రభాతవార్త :** నియోజకవర్గ కేంద్రంలోనూతనంగా ఏర్పడుతున్న కోర్టుకు ఫైనాన్స్ క్లియరెన్స్,న్యాయశాఖ అనుమతులు లభించడంతో మంగళవవారం ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి హైదరాబాద్‌లో సీఎం రేవంత్‌రెడ్డిని కలిసి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. పట్టణంలో 150 పడకల ఆసుపత్రి,సమీకృత గురుకుల పాఠశాలలు, ప్రభుత్వ డిగ్రీ కళాశాలల భవనం, మక్తల్ నుంచి నారాయణపేట రోడ్డు విస్తరణ తదితర అంశాల మీద సీఎం రేవంత్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లి చర్చించినట్లు ఎమ్మెల్యే తెలిపారు. త్వరలోనే ఆయా పనులకు సంబంధించిన నిధులను మంజూరు చేయించుకుని పనులను ప్రారంభించుకునేందుకు సన్నాహాలు చేస్తున్నట్లు ఆయన తెలిపారు.

## ప్రభుత్వ ఉద్యోగికి పదవి విరమణ సహజమే

◆ జిల్లా విద్యాశాఖ అధికారి మహ్మద్ అబ్దుల్ గని



పదవి విరమణ పొందిన వారిని సన్మానిస్తున్న దృశ్యం

**నారాయణపేట టౌన్,అక్టోబరు29 ప్రభాతవార్త:** ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ప్రధానోపాధ్యాయులుగా బాధ్యతలు నిర్వహిస్తూ మంగళవారం నంచర్ల వేణుగోపాల్ పదవి విరమణ మహోత్సవ కార్యక్రమం ఘనంగా జరిగింది. కార్యక్రమానికి జిల్లా విద్యాశాఖ అధికారి మహ్మద్ అబ్దుల్ గని హాజరై మాట్లాడుతూ ప్రభుత్వ ఉద్యోగికి పదవి విరమణ సహజమే అన్నారు. పదవిలో ఉన్నంతకాలం బాధ్యతగా పనిచేసిన ఉద్యోగికి ఎప్పుడు, గౌరవం, గుర్తింపు ఉంటుందన్నారు. పదవీ కాలంలో విద్యార్థులకు అందజేసిన సేవల గురించి కొనియాడారు. అనంతరం పదవి విరమణ పొందినవేణుగోపాల్‌ను ఉపాధ్యాయ సంఘాల నాయకులు తదితరులు శాలువాతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో మాజీ మార్కెట్ కమిటి ఛైర్మన్ జి. వీరారెడ్డి, మాజీ ఎంపిపి శివకుమార్, టిఆర్ఎస్ పార్టీ ప్రధానకార్యదర్శి విజయభాస్కర్‌రెడ్డి, అబ్దుల్ ఖయ్యుం, రిపోర్టర్ నాగరాజు, మదన్ వెంకట్‌రెడ్డి, మహెందర్‌రెడ్డి, కాలప్పతో పాటు తదితరులు ఉన్నారు.

## మార్కెట్ కమిటీ వైస్ ఛైర్మన్‌కు ముదిరాజ్ సంఘం నాయకుల సన్మానం



ముదిరాజ్ సంఘం నాయకులను సన్మానిస్తున్న దృశ్యం

**నారాయణపేట టౌన్,అక్టోబరు 29 ప్రభాతవార్త :** నారాయణపేట మార్కెట్ కమిటి వైస్ ఛైర్మన్‌గా ఎన్నుకోబడిన కోనంగేరి హన్మంతు, డైరెక్టర్ బాల్‌రాజ్‌తో పాటు మత్స్యకార సంఘం జిల్లా అధ్యక్షులు కాంత్‌కుమార్, ఇటీవల వెలువడిన డీఎస్సీ ఫలితాల్లో ప్రభుత్వ ఉపాధ్యాయ స్కూల్ అసిస్టెంట్ ఉద్యోగాన్ని పొందిన కోనంగేరి ఆంజనేయులును ముదిరాజ్ సంఘం నాయకుల ఆధ్వర్యంలో మంగళవారం సన్మాన కార్యక్రమం నిర్వహించారు. అనంతరం పలువురు మాట్లాడుతూ ముదిరాజ్‌లు అన్ని రంగాల్లో రాణించాలన్నారు. తల్లిదండ్రులు పిల్లలను విద్యారంగంలో రాణించేందుకు ప్రోత్సహించాలన్నారు. ఎదిగే కొద్దీ ఒదిగి ఉండి ముందుకు పోవాలన్నారు. ముదిరాజ్ సంక్షేమం కోసం ప్రభుత్వం అమలు చేస్తున్న ప్రతి అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ముదిరాజ్‌లంతా ఐక్యంగా ఉండి పదవులతో అన్ని రంగాల్లో రాణించాలన్నారు. ఈ కార్యక్రమంలో ముదిరాజ్ సంఘం జిల్లా అధ్యక్షులు సరాఫ్ నాగరాజ్, పట్టణ అధ్యక్షులు మిర్చి వెంకటయ్య, ఉపాధ్యక్షులు రాము,గోవింద్, లక్ష్మీకాంత్,మున్సిపల్ కౌన్సిలర్ కార్తీక్, పేరపళ్ళ శంకర్, మారుతి, గుట్టమీది నారాయణ, రిటైర్డ్ టటీచర్, మన్నె శ్యాం ప్రసాద్ టీచర్, ముదిరాజ్ సంఘం వార్డు, పట్టణ పెద్దలు, మహిళలు, యువకులు పాల్గొన్నారు.

## నేడు పశువులకు గాలికుంటు నివారణ టీకా

**తెల్కపల్లి,అక్టోబరు 29 ప్రభాతవార్త:** మండల కేంద్రంలోని పశువైద్య కేంద్రంలో ఈనెల 30న బుధవారం ఉదయం 8.30 గం.లకు ఆవులకు, ఎద్దులకు, బర్రెలకు గాలికుంటు నివారణ టీకా వేయనున్నట్లు మండలపశు వైద్యాధికారి డా.డి.మధు మంగళవారంతెలిపారు. పశువుల యజమానులు, రైతులు, పశుపోషకులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని వారు కోరారు.

## ఉపాధి కూలీలు లేకుండానే ప్రజావేదిక..?



ఉపాధి పనులపై ప్రజావేదిక నిర్వహిస్తున్న అధికారులు

**బిజినేపల్లి,అక్టోబరు 29 ప్రభాతవార్త:** కూలీలు లేకుండానే ఉపాధి హామీ సామాజిక తనిఖీ కార్యక్రమాన్ని అధికారులు తూతూ మంత్రంగా నిర్వహించారు. మహాత్మాగాంధి జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం 14వ విడత సామాజిక తనిఖీ ప్రజావేదిక కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. ఉదయం ప్రారంభం కావాల్సిన సమావేశం మధ్యాహ్నానికి ప్రారంభమైంది. సమావేశానికి అడిషనల్ డిఆర్‌డిఓ పిడి రాజేశ్వరి క్వాలిటీ కంట్రోల్ కృష్ణారావు అరవింద్‌రెడ్డి, ఏపీ డి. చంద్రశేఖర్, క్లస్టర్ టిఏ రాజేష్, ఏవిఓ రాజు, అంబుడ్స్‌మెన్ జంగయ్య, అధికారులు హాజరై ఆయా గ్రామాల వారిగా ఉపాధి పనులకు సంబంధించిన సామాజిక తనిఖీ వివరాలను ప్రజావేదికలో వెల్లడించారు. సభ ఆలస్యంగా ప్రారంభం కావడంతో రాత్రి పొద్దుపోయే వరకు పూర్తి గ్రామాల నివేదికలు సమర్పించారు. స్థానిక అధికారుల కనుసన్నల్లోనే సామాజిక తనిఖీ కార్యక్రమ నిర్వహణ మమ అనిపించినట్లు ఆయా గ్రామాల కూలీలు ఆరోపించారు. ఉపాధి హామీ పనుల్లో అవకతవకలు చేస్తూ సాఫీగా అవినీతి కొనసాగిస్తున్నారని గతంలో కూలీలు ఎంపిడిఓ కార్యాలయం వద్ద నిరసన తెలిపిన సంఘటనలు లేకపోలేదు. ఎండలో మట్టిపనిచేసిన వారి రిజిస్టర్‌లోని దినములను ఏమారుస్తూ ఉపాధి హామీ కూలీల పొట్ట కొడుతున్నారన్న ఆరోపణలపై ఉన్నతస్థాయి అధికారులు పూర్తిస్థాయి విచారణ చేయాలని ఆయా గ్రామాలకు కూలీలు వేడుకుంటున్నారు.

## ముమ్మరంగా జాతర ఏర్పాట్లు

### జాతర మైదానంలో వెలుస్తున్న దుకాణాలు



మరుగుదొడ్ల నిర్మాణం చేస్తున్న దృశ్యం



జాతర మైదానంలో వెలుస్తున్న రంగుల రాట్నం

## కుటుంబ సర్వేను సమర్ధవంతంగా నిర్ణీత సమయంలో పూర్తి చేయాలి

### వీడియో కాన్ఫరెన్స్‌లో ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క

**వనపర్తి అక్టోబరు 29 ప్రభాతవార్త:** రాష్ట్ర ప్రభుత్వం ఒక ఉన్నత లక్ష్యంతో చేపడుతున్న సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వేను సమర్ధవంతంగా నిర్ణీత సమయంలో పూర్తి చేయించాల్సిన బాధ్యత జిల్లా కలెక్టర్‌పై ఉందని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, రాష్ట్ర ఆర్థిక, ప్రణాళిక శాఖ మంత్రి మల్లు భట్టి విక్రమార్క అన్నారు. సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వే నిర్వహణ, విధి విధానాలపై కలెక్టర్లకు సూచనలు ఇచ్చేందుకు మంగళవారం ఖమ్మం కలెక్టరేట్ నుండి వీడియో కాన్ఫరెన్స్ పాల్గొనగా సహచార మంత్రులు రాష్ట్ర అబ్కారీ, పర్యాటక శాఖ మంత్రి, జూపల్లి కృష్ణారావు, బి.సి సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్,ఇరిగేషన్ శాఖ మంత్రి ఎన్.ఉత్తమ్ కుమార్‌రెడ్డి, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి ఆయా ప్రాంతాల నుండి పాల్గొన్నారు.ఈసందర్భంగా ఉపముఖ్యమంత్రి మాట్లాడుతూ ఫిబ్రవరి 4,2024 న రాష్ట్ర శాసనసభ తీర్మానం మేరకు రాష్ట్రం లోని ఎస్సి,ఎస్టి, బీసీ , ఇతర బలహీన వర్గాల అభ్యున్నతి కొరకు, వివిధ సామాజిక,ఆర్థిక,విద్య, ఉపాధి,రాజకీయ అవకాశాలను మెరుగుపంచడం కోసం సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వే చేసేందుకు ప్రణాళికలె రూపొందించడం జరిగిందన్నారు. రాష్ట్రంలో ఏ ఒక్క ఇల్లు, ఏ ఒక్క కుటుంబం మిగిలిపోకుండా ప్రణాళిక ప్రకారం నిర్ణీత సమయంలో సర్వే పూర్తి చేసేందుకు జిల్లా కలెక్టర్లు బాధ్యతలు తీసుకోవాలని సూచించారు. సమగ్ర సర్వే కార్యాచరణ పై రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి వివరిస్తూ ముందుగా జిల్లాలలో ఎన్యుమరేటర్ బ్లాక్‌లు గుర్తించి వాటిలో కుటుంబాల జాబితాను సిద్ధం చేసుకోవాలని సూచించారు. ఎన్యుమరేటర్ బ్లాక్ వారీగా ఎన్యుమరేటర్‌లను నియమించుకుని వారికి సమగ్ర శిక్షణ ఇచ్చి నిర్ణీత ప్రోఫార్మలో సూచించిన సమాచారం పకడ్బందీగా పూరించే విధంగా చూడాలని కలెక్టర్లను సూచించారు. ప్రతి పది మంది ఎన్యుమరేటర్‌లకు ఒక పర్యవేక్షకుడిని నియమించి ర్యాండంగా చెక్ చేసే విధంగా చర్యలు తీసుకోవాలని సూచించారు. మండల ప్రత్యేక అధికారులను నియమించి ఉత్తర్వులు జారీ చేయాలని సూచించారు. నవంబర్ 6నుండి 18వ తేదీ వరకు సర్వే చేసేందుకు గడువు ఉంటుందని, సర్వే చేసే ముందు ప్రతి కుటుంబం నుండి తమ ఆధార్ కార్డు, రేషన్ కార్డు,ధరణి పాస్ పుస్తకం సిద్ధంగా ఉంచుకునే విధంగా టామ్ టామ్ ప్రచారం చేయించాలని సూచించారు. రాష్ట్ర అబ్కారీ, పర్యాటక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు మాట్లాడుతూ సర్వే పూర్తి అయ్యాక తప్పులు లేకుండా సమగ్ర సర్వే సమాచారాన్ని ఆన్లైన్ లో తప్పులు లేకుండా పకడ్బందీగా నమోదు చేయించేందుకు అవసరమైన చర్యలు సిద్ధం చేసుకోవాలని కలెక్టర్లను సూచించారు. స్పందించిన జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి వనపర్తి జిల్లాలో సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వే పకడ్బందీగా నిర్వహించేందుకు జిల్లాలో ఎన్యుమరేటర్ బ్లాకులుగుర్తించడం జరిగిందని,సూపర్వైజర్‌లు,మండల ప్రత్యేక అధికారులకు శిక్షణ సైతంపూర్తి చేయడం జరిగింద న్నారు. ఎన్యుమరేటర్లకు శిక్షణ ఇచ్చి కుటుంబాల జాబితా సిద్ధం చేసేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. నిర్ణీత సమయం లో సమర్ధవంతంగా సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వేపూర్తి చేసేందుకు పకడ్బందీగా చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలియజేశారు. అదనపు కలెక్టర్ లోకల్ బాడీస్ సంచిత్ గంగ్వార్, అదనపు కలెక్టర్ రెవెన్యూ జి.వెంకటేశ్వర్లు, ఆర్డీఓ సుబ్రమణ్యం, సి.పి.ఓ భూపాల్ రెడ్డి, జిల్లా అధికారులు, మున్సిపల్ కమిషనర్లు పాల్గొన్నారు.



విడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క , పాల్గొన్న జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి

## సామాజిక, విద్య, ఆర్థిక, ఉద్యోగ, రాజకీయ, కుల అంశాలపై సర్వే..

■ గద్వాల జిల్లా కలెక్టర్ బి. ఎం సంతోష్

**గద్వాల, అక్టోబరు 29, ప్రభాతవార్త:** సామాజిక, విద్య, ఆర్థిక, ఉద్యోగ, రాజకీయ, కుల అంశాల పై సర్వేకు సంబంధించిన అన్ని ఏర్పాట్లను పకడ్బందీగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ బి.ఎం సంతోష్ అధికారులకు ఆదేశించారు. మంగళవారం కలెక్టర్ కార్యాలయంలోని సమావేశ మందిరంలో ఇంటింటి సర్వే కార్యక్రమంలో భాగంగా ఏర్పాటు చేసిన శిక్షణ కార్యక్రమంలో పాల్గొని సంబంధిత అధికారులకు పలు సూచనలు చేశారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న సమగ్ర సర్వే నవంబర్1 నుండి 3వ తేదీ వరకు ఎన్యూమరేటర్లు క్షేత్రస్థాయిలో వెళ్లి ఇంటింటి ప్రణాళికలను సిద్ధం చేసుకోవాలని సూచించారు. సర్వే చేపట్టే ముందు గ్రామాలలో ప్రచారాలు నిర్వహించి సర్వే అధికారులకు అవసరమైన సమాచారం అందించే విధంగా ఆధార్ కార్డు, రేషన్ కార్డు, పట్టా పాస్ పుస్తకాలు సిద్ధంగా ఉంచుకోనేలా ప్రజలకు తెలియజేయాలని అన్నారు. 6వ తేదీ నుండి 18వ తేదీ వరకు ఇంటింటి సర్వే పక్కాగా చేపట్టి పూర్తిచేయాలని సర్వే అనంతరం నవంబర్ 19 నుండి 27వ తేదీ వరకు డేటా ఎంట్రీ పనులను ఎలాంటి తప్పులు లేకుండా చేపట్టి పూర్తి చేయాలని ఆదేశించారు. ఈ పనులలో జిల్లా స్పెషల్ ఆఫీసర్లు, మండల స్పెషల్ ఆఫీసర్లు, ఎంపీడీవోలు, మున్సిపల్ కమిషనర్లు భాగస్వాములు కావాలని సూచించారు. మంగళవారం మాస్టర్ ట్రైనర్ల ద్వారా శిక్షణ పొందుతున్న అధికారులు రేపటి నుండి మండల స్థాయిలో సర్వే నిర్వహించి సిబ్బంది అందరికీ శిక్షణ అందించాలన్నారు. ఈ సందర్భంగా మాస్టర్ ట్రైనర్‌లు సర్వే ఏ విధంగా చేయాలన్నది అందరికి అవగాహనా కల్పించారు. ఈ సమావేశంలో జిల్లాఅదనపు కలెక్టర్‌లక్ష్మీనారాయణ.జిల్లా అధికారులు తహసీల్దార్లు, ఎం.పి.డి.ఓ లు ఏపిఓ లు, , ఏపిఎం లు తదితరులు పాల్గొన్నారు.



సామాజిక అంశాల సర్వేపై అధికారులతో సమావేశమైన కలెక్టర్ సంతోష్, అదనపు కలెక్టర్

## పూర్వ విద్యార్థుల సాయం మరువలేనిది

### జడ్చర్ల బిఆర్ఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో పూర్వ విద్యార్థుల సమ్మేళనంలో ప్రిన్సిపాల్ సుకన్య

**జడ్చర్ల టౌన్,అక్టోబరు 29 ప్రభాతవార్త:** కళాశాలలో నాక్ లో ఎ సాధించడానికి పూర్వ విద్యార్థుల సహాయ సహకారాలు ఘనంగా ఉన్నాయని అదే తరహాలో ఇప్పుడు కూడా సహాయ సహకారాలు అందించాలని డా.బిఆర్ఆర్ కళాశాల ప్రిన్సిపాల్ సుకన్య పేర్కొన్నారు. జడ్చర్లలోని డా.బిఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మంగళవారం పూర్వ విద్యార్థుల సమ్మేళనం కళాశాల ప్రిన్సిపల్ డా.జి.సుకన్య అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ చదువుకున్న కళాశాలకు తమవంతు సహాయ సహకారాలు చేయడమే కాక వాటి అభివృద్ధిలో పాలు పంచుకోవడం సంతోషంగా ఉందన్నారు. పూర్వ విద్యార్థుల సంగం అద్యక్షుడు పాలాది రామ్మోహన్ మాట్లాడుతూ కళాశాల అభివృద్ధిలో ప్రతి అంశంలోను పూర్వ విద్యార్థుల తమదైన శైలిలో పాలుపంచుకున్నారని తెలియజేశారు. ఇకముందు కూడా తమ నుండిసంపూర్ణ మద్దతు లభిస్తుందని తెలిపారు.మొదటి బ్యాచ్ నుండి ఇటీవల చదువుకున్న విద్యార్థులు కూడా ఈ సమావేశానికి హాజరయ్యారు. కళాశాల అలుమ్ని కో ఆర్డినేటర్ డా.సదాశివయ్య మాట్లాడుతూ గత 5 సంవత్సరాలలో పూర్వ విద్యార్థులు చేసిన సహాయం ఎంతో గణనీయంగా ఉందన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్‌డా.జి.సుకన్య, వైస్ ప్రిన్సిపాల్ డా.నర్మద, అలుమ్ని కో ఆర్డినేటర్ డా.సదాశివయ్య,అలుమ్ని ప్రెసిడెంట్‌పాలాది రామమోహన్,సెక్రెటరీ బాద్మి రవిశంకర్, ట్రెజరర్ దత్తుకుమార్, కోడుగల్‌యాదయ్య,మొదటిబ్యాచ్ విద్యార్థిజంగయ్య,కాల్వరాంరెడ్డి,ఫరీద్,రాజేంద్రగౌడ్,జానకిరామ్‌రెడ్డి ,కళాశాల అలుమ్నికమిటి సభ్యులుపుష్పలత,వెంకటరెడ్డి,నరసింహారావు, రాఘవేందర్‌రెడ్డి పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ సుకన్య

## గద్వాల మున్సిపల్ పరిధిలో డ్రోన్ సర్వేతో మాస్టర్ ప్లాన్

■ గద్వాల జిల్లా కలెక్టర్ బి. ఎం సంతోష్

**గద్వాల, అక్టోబరు 29 ప్రభాతవవార్త:** జిల్లాలో గద్వాల్ మున్సిపల్ పరిధిలో డ్రోన్ సర్వే చేసి మాస్టర్ ప్లాన్ రూపొందిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ బి.ఎం.సంతోష్ అన్నారు. మంగళవారం కలెక్టరేట్ ఆవరణలో టీడీసీపీ అధికారుల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన డ్రోన్ ను మున్సిపల్ ఛైర్ పర్సన్ బి.ఎస్. కేశవులు మున్సిపల్ అధికారులు, సర్వే ఆఫ్ ఇండియా అధికారులతో పూజ చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లా అభివృద్ధిలో భాగంగా, మున్సిపాలిటీ సమస్యలు లేకుండా మాస్టర్ ప్లాన్ రూపొందిస్తున్నామని అన్నారు. భవిష్యత్ తరాలకు డిజిటల్ రూపంలో అందుబాటులో ఉంచడమే లక్ష్యమని అన్నారు. కేంద్ర ప్రభుత్వం అమృత్ 2.0 పథకంలో భాగంగా జిఐఎస్ ఆధారిత ప్రణాళిక కోసం ఎంపికైన తెలంగాణలోని 20 మున్సిపాలిటీలో ఒకటైనగద్వాల మున్సిపాలిటీలో డిజి టల్ మాస్టర్ సర్వే చేయడం కోసం సెలెక్ట్ చేసినట్లు తెలిపారు. గద్వాల్ మున్సిపాలిటీకి సంబంధించిన మాస్టర్ ప్లాన్ డిజిటల్ సర్వేను లేటెస్ట్ టెక్నాలజీ, డ్రోన్ కెమెరాల సహాయంతో పూర్తిగా వివరాలతో తయారు చేస్తున్నామని అన్నారు. ప్రతిదీ చిత్రాలతో విభాగాల వారీగా సేకరించి బేస్ మ్యాప్‌లను తయారు చేస్తారన్నారు. డ్రోన్ సర్వేల ద్వారా సేకరించిన ఖచ్చితమైన మ్యాపింగ్‌తో భవనాలు, రహదారులు, నీటివనరులు, పార్కులు, మురుగు వ్యవస్థలు వంటి మౌలిక వసతుల స్థితిని పరిశీలించి వాటి నిర్వహణ అభివృద్ధికి సమగ్ర ప్రణాళికలు రూపొందించవచ్చని అన్నారు. కంప్యూటర్లో డ్రోన్ సర్వే పద్ధతులను పరిశీలించారు. డ్రోన్ ఎలా పనిచేస్తుందో, మున్సిపాలిటీని మొత్తం స్థలాన్ని ఎలా కవర్ చేస్తుందో, ఆ డేటాను ఎలా ప్రాసెస్ చేస్తారో,డ్రోన్ సర్వేలో అందులో ఉన్న సమాచారాన్ని ఎలా వినియోగించాలో వివరంగా తెలుసుకున్నారు.ఈ మాస్టర్ ప్లాన్ సర్వే సాయంతో గద్వాల్ పట్టణం అభివృద్ధి చెందుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో డీటీసీపీ అడిషనల్ డైరెక్టర్ రమేశ్ బాబు, మున్సిపల్ కమిషనర్ దశరథ్, టౌన్ ప్లానింగ్ అధికారి కుర్మన్న, సర్వే ఆఫ్ ఇండియా అధికారులు, డీటీపీసీ అధికారులు, మున్సిపల్ అధికారులు , సిబ్బంది పాల్గొన్నారు.





డ్రోన్ సర్వేను పరిశీలన చేస్తున్న కలెక్టర్ సంతోష్, మున్సిపల్ ఛైర్మన్, అధికారులు

## ఏపీజే అబ్దుల్ కలాం జాతీయ అవార్డును సైన్స్ ఫిక్షన్ రచయిత ప్రతాప్‌కు బహూకరణ




అవార్డు అందుకుంటున్న డా. ప్రతాప్ కౌటిల్య

**బిజినేపల్లి,అక్టోబరు 29 ప్రభాతవార్త :** పాపులర్ సైన్స్‌ఫిక్షన్, సైన్స్ రచయిత డా.ప్రతాప్ కౌటిల్యకు ఏపీజే అబ్దుల్ కలాం జాతీయ అవార్డును సైన్స్ ఫిక్షన్ రచనల్లో ప్రతిభ కనబర్చినందుకు అందుకున్నారు. హైదరాబాద్‌లోని రవింద్రభారతిలో ప్రతి ఏటా చేపట్టే డా. చిన్నారావు వెల్ఫేర్ ఫౌండేషన్ ఆద్వర్యంలో మంగళవారం నిర్వహించిన ఏపిజె అబ్దుల్ కలాం జాతీయ అవార్డుల ప్రధానోత్సవం కార్య క్రమంలో మండంలోని పాలెం గ్రామానికి చెందిన సైన్స్ రచయిత, డిగ్రీ కళాశాల సిడిపిసి మెంబర్ డా. ప్రతాప్ కౌటిల్యకు నిర్వాహకులు డా.దోమన చిన్నారావు, డా.అలపాటిలుఅందజేసి మాట్లాడారు. పాపు లర్ సైన్స్‌లో ఆయన చేసిన రచనలు ఎంతో ఆలోచనలను రేకెత్తించగా, నూతన ఆవిష్కరణలకు మార్గదర్శకంగా, రాబోయే కొత్త తరాల శాస్త్రవేత్తలకు ఈయన సైన్స్ ఫిక్షన్ రచనలు ఎంతో ఉపయోగపడతాయని కొనియాడారు. సైన్స్‌లో రాబోయే రోజుల్లో మాన వాళికి ఉపయోగపడే ఎన్నో రచనలు, ఆవిష్కరణ చేయాలని అభిలషించారు. ఏపీజే అబ్దుల్ కలాం జాతీయ అవార్డు అందుకున్న డా. ప్రతాప్ కౌటిల్యను మల్టీ జోనల్ ఉన్నత విద్యా జాయింట్ డైరెక్టర్ డా. డీఎస్ఆర్ రాజేందర్‌సింగ్, క్రైమ్ బ్రాంచ్ ఎసిపి కిరణ్‌కుమార్, కుటుంబ సభ్యులు, ఉపాధ్యాయులు సునిత, శశికళ,ఎస్‌వి డిగ్రీ కళాశాల అధ్యాపకులు, గ్రామస్తులు అభినందించారు.

## కాలువలోకి దూసుకెళ్లిన స్కూల్ వ్యాన్

### తప్పిన ప్రమాదం

**లింగాల,అక్టోబరు 29 ప్రభాతవార్త :** లింగాల మండల కేంద్రానికి చెందిన ఓ ప్రైవేట్ వ్యాన్ రోడ్డు పక్కన కాలువలోకి దూసుకెళ్లగా ప్రమాదం తప్పింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం లింగాల మండల కేంద్రంలోనిసెయింట్ పీటర్స్ ప్రైవేట్ స్కూల్ వ్యాన్ మంగళవారం సాయంత్రం లింగాల పాఠశాల నుంచి రాయవరం, కొత్త చెరువు తండా గ్రామాలకు చెందిన విద్యార్థులను ఎక్కించుకుని కొంతమంది విద్యార్థులను రాయవరందింపి మళ్ళీకొత్తచెరువు తండా గ్రామానికి వెళ్తున్న మార్గమధ్యలో అదుపుతప్పి కాలువలోకి వేగంగా దూసుకెళ్లింది.అదృష్టవశాత్తు అందులోప్రయాణిస్తున్న పిల్లలు సురక్షితంగా బయటపడడంతో పెద్ద ప్రమాదం తప్పింది. అధిక స్పీడ్ వల్ల ఈ ప్రమాదం జరిగిందని స్థానికులు తెలిపారు. కాలం చెల్లిన వాహనాలను వినియోగించకుండా చూస్తూ ప్రభుత్వ నిబంధనలు అమలయ్యే విధంగా చూడాలని పలువురు కోరుతున్నారు.



కాలువలోకి దూసుకెళ్లిన స్కూల్ వ్యాన్